వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 232 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/-



# రేఖాగుప్తా అనే నేను

## ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తా ప్రమాణం

- ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- ఎన్డి పక్షాన పలువురు సీఎంలు, డిప్యూటి సీఎంలు హాజరు
- ప్రత్యేక ఆకర్షణగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్

**న్యూఢిల్లీ,**
దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. -మిగతా 3 లో



# బీఆర్ఎస్ అండతోనే ఏపీ జలదోపిడీ

- కృష్ణా జలాల్లో 200 టిఎంసిలు చాలన్న ఘనులు
- శ్రీశైలం,సాగర్‌లను ఏపీకి అప్పగించి చోద్యం చూశారు
- నీటిపారుదల రంగాన్నిసర్వనాశనం చేశారు
- బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంపై మండిపడ్డ ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్,**
ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. -మిగతా 3 లో



# ఎన్నిక ఏదైనా విజయం మనదే

- ఎన్‌డిఎ పక్ష సమావేశంలో ప్రధాని మోడీ
- ఎన్‌డిఎ నేతలకు బీజెపీ మధ్యాహ్న విందు

**న్యూఢిల్లీ,**
ఎన్నిక ఏదైనా ఇక ఎన్‌డిఎదే విజయమని, ఎక్కడా తగ్గేది లేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. బెంగాల్ కావచ్చు, బీహార్ కావచ్చు, కేరళ అయినా విజయం తమ కూటమిదేనని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఢిల్లీలో ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం జరిగింది. -మిగతా 3 లో



# కృష్ణాజలాలపై మొదటి ద్రోహి కేసీఆర్

- దక్షిణ తెలంగాణ ఎడారి కావడానికి కాంగ్రెస్ కారణం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,**
కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిన మొదటి ద్రోహి కేసీఆరే అని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. దక్షిణ తెలంగాణ ఏడారి కావడానికి మొదటి కారణం కాంగ్రె అయితే రెండో కారణం బీఆర్ఎస్ అని విమర్శించారు. -మిగతా 3 లో

# సీఎం రేవంత్ మొద్దు నిద్ర వీడాలి

## మొద్దు నిద్రవీడి కృష్ణా జలాల దోపిడీని అడ్డుకోండి

- మితో కాకపోతే చెప్పండి.. మేము చేస్తాం
- బీఆర్ఎస్ పొలాలకు నీళ్లు పారిస్తే.. కాంగ్రెస్ నీల్లు నములుతుంది
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్,**
కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. -మిగతా 3 లో



# యూనివర్సిటీలపై కేంద్రం కుట్రలు

- కలసి పోరాడుదామని భట్టి పిలుపు

**తిరువనంతపురం,**
యూనివర్శిటీలపై కేంద్రం కుట్రలపై కలిసి పోరాడుదామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.. కేరళ తిరువనంతపురంలోని జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో పాల్గొన్న ఆయన.. విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేరని మండిపడ్డారు. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించాలన్నారు. -మిగతా 3 లో

# పవన్ కళ్యాణ్ వస్త్రధారణపై మోడీ ఆశ్చర్యం

- ఢిల్లీ సీఎం ప్రమాణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన
- హిమాలయాలకు వెళుతున్నారా అంటూ...సెటైర్లు
- నవ్వులు పూయించిన మోడీ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,**
దేశ రాజధాని హస్తినలో ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వేషధారణ చూసి ప్రధాని మోడీ ఆశ్య్ర పోయారు. సన్యాసం పుచ్చుకుని హిమాలయాలకు వెళుతున్నారా అంటూ చమత్కరించారు. ఢిల్లీ సిఎం ప్రమాణ కార్యక్రమం అట్టహాసంగా -మిగతా 3 లో



# స్వర్ణగోపుర కుంభాభిషేకానికి సీఎంకు ఆహ్వానం

- ఆదివారం 23న స్వర్ణగోపుర మహాకుంభాభిషేకం

**హైదరాబాద్,**
యాదాద్రిలో జరుగుతున్న శ్రీశ్రీ సుదర్శనలక్ష్మీనారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురమహా కుంభాభిషేక మహోత్సవానికి సిఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం ఈ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆదివారం 23న స్వర్ణగోపుర మహాకుంభాభిషేకం జరుగనుంది. -మిగతా 3 లో

# లోక్‌పాల్ ఉత్తర్వులపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ,**
హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ ఇచ్చిన ఉత్తర్వులపై గురువారం సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ ఉత్తర్వులు న్యాయవ్యవస్థను భంగపరిచేవిధంగా ఉన్నాయని పేర్కొంది. కేంద్రానికి, లోక్‌పాల్ కార్యాలయానికి, ఫిర్యాదుదారునికి నోటీసులిచ్చింది. ూష్ట్రంలోని అదనపు జిల్లా జడ్జిని, అదే హైకోర్టు జడ్జిని ఒక ప్రైవేట్ కంపెనీ ఫిర్యాదుదారుపై దాఖలైన ఫిర్యాదును ఆ కంపెనీకి అనుకూలంగా మార్చేలా ప్రభావితం చేశారని హైకోర్టు సిట్టింగ్ అదనపు జడ్జిపై రెండు ఫిర్యాదులు దాఖలయ్యాయి. ఈ ఫిర్యాదులపై హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పేరున్న హైకోర్టు జడ్జి బార్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ప్రైవేట్ కంపెనీ ఫిర్యాదుదారుగా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ రెండు ఫిర్యాదులలో రిజిస్ట్రీలో నమోదైన వివరాలు, సంబంధిత మెటీరియల్‌ను పరిశీలన కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపాలని లోక్‌పాల్ ఉత్తర్వులు జారీ చేసింది.

# సీఎం రేవంత్‌రెడ్డి నా దేవుడు

**పూజ గదిలో రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టుకున్న కుమారి ఆంటీ... వీడియో వైరల్**



**హైదరాబాద్,**
కుమారి ఆంటీ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. తన ఇంట్లోని పూజ గదిలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకున్న ఆమె.. ప్రతి రోజూ దేవుళ్లతో పాటు నిత్యం హారతులిస్తూ రేవంత్ రెడ్డికి కూడా పూజలు చేస్తున్నారు. ఈ రోజు తాను ఫుడ్ స్టాల్ నడిపిస్తున్నానంటే అందుకు కారణం సీఎం అని, ఆయన తనకు దేవుడితో సమానం అని అందుకే పూజలు చేస్తుంటానని చెప్పుకొచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా నెట్టింట్లో వైరల్ అవుతోంది. సీఎంపై ప్రత్యేక అభిమానం హైదరాబాద్ మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలో కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ నడుపుతున్నారు. ఆమె ఫుడ్ స్టాల్‌లో తక్కువ ధరకే ఫుడ్ దొరుకుతుందని, టేస్టీగా ఉంటుందని కొందరు గతంలో సోషల్ మీడియాలో ఆమె వీడియోలో షేర్ చేశారు. ఆ వీడియోలు కాస్త వైరల్ గా మారడంతో కుమారి ఆంటీ సెలబ్రేటీగా మారారు. అయితే, పోలీసులు కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ తొలగించేందుకు ప్రయత్నించారు. కానీ, సీఎం రేవంత్ స్పందించి తొలగించవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కుమారీ ఆంటీ సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యేక అభిమానాన్ని పెంచుకుంది.

# హైడ్రాను మరింత పటిష్టం చేయాలి

**-భూ కబ్జాదారుల ఆటకట్టిస్తున్న హైడ్రా**
**-విలేకరుల సమావేశంలో శివారు ప్రాంత బాధితులు**



**హైదరాబాద్,**
: హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు భూ కబ్జాదారుల బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కబ్జాదారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు హైడ్రా పరిష్కారం చూపుతోందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన బాధితులు నాగేశ్వరరావు, సాయికుమార్, చంద్రశేఖర్, తనూజ, శ్రీనాథ్, గాయత్రి, నవీన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, కబ్జాదారుల బారి నుంచి తమను రక్షిస్తుందని చెప్పారు. కొంత మంది కబ్జాదారులు హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైడ్రా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ స్థలాను కబ్జా చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్షపూరిత కేసులు నమోదు చేస్తున్నారని, సీఎం స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు తమకు హైడ్రా చేసిన మేలును, కబ్జాదారులు వేధిస్తున్న వివరాలను పలువురు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దివ్యనగర్, కోహెడ, అమీన్‌పూర్, నాగిరెడ్డి చెరువు, ముత్తంగి, బడంగ్ పేట్ తదితర ప్రాంతాల్లో హైడ్రా వల్ల లబ్ధిపొందిన వారు పాల్గొన్నారు.

# ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు కేంద్రం హెచ్చరిక

**-ఎ రేటెడ్ కంటెంట్ లేకుండా చూడాలని ఉత్తర్వులు**




న్యూఢిల్లీ
'ఇండియాస్ గాట్ లాటెంట్' కార్యక్రమంలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన క్రమంలో ఐటీ రూల్స్‌లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఓటీటీలు, సామాజిక మాధ్యమాలు తప్పనిసరిగా పాటించాలని కేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఎ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలని ఆదేశించింది. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు అందాయి. ఐటీ రూల్స్‌లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను సామాజిక మాధ్యమాలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా పాటించాలి. ఈ నిబంధనలు ఉల్లంఘించే ఏ కంటెంట్‌ను ప్రసారం చేయకూడదు. వయస్సు ఆధారిత కంటెంట్ అందుబాటులో ఉండాలి. స్వీయ నియంత్రణ కలిగిన ఓటీటీలు నైతిక విలువలను పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొంది. ఐజీఎల్‌లో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడంతో ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడిపై పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వాటిపై ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్ చేయాలని ఓ పిటిషన్‌లో పేర్కొన్నాడు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు అల్హాబాదియా వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించడానికి ఏవైనా చర్యలు తీసుకొనే యోచనలో ఉన్నారా..? అని సుప్రీం కేంద్రాన్ని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసులు సైతం జారీ చేసింది. ఈ క్రమంలో తాజా ఉత్తర్వులను కేంద్రం జారీచేసింది.

# నిరుపేద యువకుడికి సీఎం రేవంత్ అండ

**-వైద్య ఖర్చులను భరించేలా ఆదేశాలు జారీ**



**హైదరాబాద్,**
కండరాల వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేక పోతున్న నిరుపేద యువకుడు రాకేష్ గురించి తెలుసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలించిపోయారు. తక్షణమే రాకేష్‌కు కావాల్సిన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉచితంగా వైద్యం అందించడంతో పాటు రాకేష్ కోసం ఛార్జింగ్ వాహనాన్ని కూడా అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు రాకేష్ కుటుంబీకులతో ఫోన్ లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ఆదుకుంటామని సీఎం తరఫున హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేష్ చాలా కాలం నుండో మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరగడంతో నడవలేని పరిస్థితికి వచ్చాడు. అయితే రాకేష్ కు ఆరోగ్యం మెరుగు కావాలంటే ఖరీదైన ఇంజక్షన్‌లను క్రమం తప్పకుండా ఇవ్వాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న రాకేష్ కుటుంబం ఖరీదైన వైద్యం చేయించ లేకపోతుందని, పత్రికలో వచ్చిన కథనంపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. ములకనూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో రాకేష్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. స్వగ్రామం నుంచి ములకనూరు వెళ్లి రావడానికి చార్జింగ్ వెహికల్ ను కూడా ప్రభుత్వం అందించనున్నది. తమ బిడ్డను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాకేష్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

# రాజలింగమూర్తి హత్య కేసుపై ఫాస్ట్రాక్ కోర్టులో విచారిస్తాం

**దీని వెనుక బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుల హస్తం**
**హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**హైదరాబాద్,**
సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యపై సీబీసీఐడీతో విచారిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఈ హత్యపై పోలీసుల విచారణ జరుగుతోందని.. దోషులను 24 గంటల్లోనే పట్టుకుంటామని తెలిపారు. రాజలింగమూర్తి కేసును ఫాస్ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తామని చెప్పారు. రాజలింగమూర్తిని గండ్ర వెంకట రమణా రెడ్డి హత్య చేయించారని ఆరోపించారు. దీని వెనక కేసీఆర్, కేటీఆర్, హరీష్ ఉన్నారని ఆరోపించారు. 'మీరు తెలంగాణలో ఎలా పుట్టారో అర్థం కావడం లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. హత్యా రాజకీయాలు తెలంగాణ సంస్కృతి కాదు. బీఆర్ఎస్ నేతలు హత్యా రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. దోపిడీని ప్రశ్నిస్తే హత్య చేసే స్థాయికి దిగజారారని తెలిపారు. సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యను ఖండిస్తున్నాను" అని అన్నారు. మేడిగడ్డ అక్రమాలపై రాజలింగమూర్తి కోర్టులో పోరాడుతున్నాడని తెలిపారు. నీళ్ల పోసుకుని పెట్రోల్ అని చెప్పి అమాయకులు చనిపోవడానికి హరీష్ కారణం అయ్యారని దుయ్యబట్టారు. దోపిడీ బయట పడుతుందని హత్యలు చేస్తారా అంటూ ఫైర్ అయ్యారు. అడ్వకేట్ వామన రావును హత్య చేసిన వాళ్ళకే కేసీఆర్ టికెట్ ఇచ్చారన్నారు. హరీష్ రావు మానవత్వం ఉన్న మనిషేనా అని ప్రశ్నించారు. రాజలింగమూర్తి హత్యను డైవర్ట్ చేసేందుకు హరీష్ రావు కృష్ణా నీళ్ల గురించి మాట్లాతున్నారన్నారు. "స్కాముల గురించి ప్రశ్నిస్తే చంపేస్తారా? 15 నెలల నుండి కేసీఆర్ ఈ ఎవరికైనా కనిపించాడా? కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని కేసీఆర్‌కు ఎలా తెలుసు? ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా భట్టి ఒంటరి పోరాటం చేశారు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి: మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగమూర్తి హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హత్యకు కారకులను వెంటనే పట్టుకోవాలని పోలీసులను ఆదేశించామని తెలిపారు.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

**-ఎంపిక చేసిన బిజెపి అగ్ర నాయకత్వం**

**న్యూఢిల్లీ,**
దేశ రాజధాని ఢిల్లీలో భాజపా ప్రభుత్వం కొలువుదీరగా, అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచిన విజేందర్ గుప్తా ను పార్టీ ఎంపిక చేసింది. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా పార్టీ తనను ఎంపిక చేయడంపై విజేందర్ గుప్తా హర్షం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 10 ఏళ్ల క్రితం అసెంబ్లీ నుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. తాజాగా ఆయన అదే సభకు స్పీకర్‌గా ఎంపిక కావడం గమనార్హం. 2015లో ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే ఆల్కాలంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులో పాల్గొన్న భాజపా ఎమ్మెల్యే అయిన విజేందర్ గుప్తాను అప్పటి స్పీకర్ ఆరోజు సాయంత్రం 4 గంటల వరకు సభ నుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో.. మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకొని అసెంబ్లీ నుంచి బయటకు తీసుకెళ్లారు. తాజాగా దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి.
ఇదిలాఉంటే.. రామ్‌లీలా మైదానంలో గురువారం వేల మంది ప్రజల సమక్షంలో ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు ఎన్డీయే నేతలు, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు.

# రేఖాగుప్తా అనే నేను

(మొదటి తరువాయి)

లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995-96లో ఢిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996-97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.

# బీఆర్ఎస్ అండతోనే ఏపీ జలదోపిడీ

(మొదటి తరువాయి)

కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత భారాసదని విమర్శించారు. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని కమీషన్ల కక్కుర్తితో అధిక వడ్డీకి వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. అప్పుల నుంచి బయటపడేందుకు తాము ప్రయత్నిస్తుంటే..బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎస్ఎల్ బీసీ టన్నెల్ ను పదేళ్లు పూర్తిగా పడుకోబెట్టారని ఆరోపించారు. లక్షా 85 వే లకోట్లు ఖర్చు చేసి ఎకరాకు నీళ్లివ్వలేదన్నారు ఉత్తమ్. సగం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదు.. విభజన చట్టం అమలు కోసం కేసీఆర్ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించు కోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, దిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. ఈక్రమంలోనే శ్రీశైలం ప్రాజెక్టును ఏపీకి అప్పగిస్తామని 2021-22లో బీఆర్ఎస్ ఒప్పుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నాగార్జున సాగర్ శ్రీశైలం ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగిస్తామని 2021లో బీఆర్ఎస్ ఒప్పుకుందన్నారు. 2023 నవంబర్ లో సాగర్ ను ఏపీ ఆక్రమించింది.. ఏపీ ఆక్రమణ తర్వాతే సాగర్ సీఆర్పీఎఫ్ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి రోజు 4.2 టీఎంసీలు తీసుకెళ్లారని చెప్పారు ఉత్తమ్. రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ హయాంలో రోజు 9.6 టీఎంసీలు దోచుకెళ్లారని ఆరోపించారు ఉత్తమ్. కృష్ణా నీళ్లను ఏపీకి దోచి పెట్టినందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించారని విమర్శించారు. హరీశ్ రావు ఇరిగేషన్ మినిస్టర్ గా కాదు..అసలు దేనికి పనికి రాడన్నారు. తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని వ్యాఖ్యానించారు.ఏపీ నీళ్ల దోపిడికి పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు . జగన్ దోస్తీ కోసం రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు వదిలేశారని చెప్పారు. పదేళ్లలో శ్రీశైలం నుంచి ఔట్ సైడ్ బేసిన్ 1200 టీఎంసీలు తరలించారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు 550 టీఎంసీలు రావాల్సి ఉన్నా.. 298 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత కేసీఆర్ దేనని విమర్శించారు. కేసీఆర్ అసమర్థత,చేతగాని తనం వల్లే పాలమూరుకు నీటి కష్టాలు వచ్చాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం టెలిమెట్రీ పరికరాలు కూడా పెట్టలేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు.

# సీఎం రేవంత్ మొద్దు నిద్ర వీడాలి

(మొదటి తరువాయి)

పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే కాంగ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65 టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నాగార్జున సాగర్ కేంద్ర బలగాల చేతిలో ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి లేకుండా ఏపీ ఇష్టారీతిన నీటిని తరలించుకుపోతోంది. కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు, చంద్రబాబును అడిగే దమ్ము లేదు. ప్రతిపక్షాలను బాగా విమర్శిస్తారు కానీ, కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. శ్రీశైలం, సాగర్ నీటిని తరలించుకుపోతుంటే కనీసం స్పందించడం లేదు. 1015 టీఎంసీల నీరు కృష్ణాలో ఈ ఏడాది వచ్చింది. ఏపీకి కేవలం 9 టీఎంసీల హక్కు మాత్రం ఉంది. ఇవాళ కూడా ఏపీకి నీరు తరలిస్తూనే ఉన్నారు. 220 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాడుకుంది. ఇంకా 123 టీఎంసీలు రావాలి. తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది. ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని హరీశ్‌రావు సూచించారు. యాసంగి పంట కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తారో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు ఏసుకున్నారు, సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ఏపీకి నీరు ఆపేలా చూడండి. కృష్ణా బోర్డు కార్యాలయం ముందు, ఢిల్లీలో ధర్నా చేద్దాం.. మేమూ వస్తాం. సాగర్ కుడి కాల్వ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీరు వెళ్లకుండా అడ్డుకోవాలి. నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది కాబట్టే ఏపీ ఇష్టం వచ్చినట్లు నీటిని తరలించుకుపోతోంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు

# పవన్ కళ్యాణ్ వస్త్రధారణపై మోడీ ఆశ్చర్యం

(మొదటి తరువాయి)

జరిగింది. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల కీలక నేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ దీక్షలో ఉండటంతో ప్రత్యేక దుస్తులతో ఈ కార్యక్రమంలో కనిపించారు. ప్రధాని మోదీ వేదికపైకి రాగానే అక్కడున్న నేతలను పలకరించారు. తొలుత గోవా సీఎం ప్రమోద్ సావంత్, ఆ తరువాత మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు నమస్కరిస్తూ ముందుకు సాగిన మోదీ, ఆ తర్వాత మహారాష్ట్ర మరో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను పలకరించారు. ఆ తర్వాత ఫడ్నవీస్‌తో పాటు మిగతా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు నమస్కరించుకుంటూ ముందుకుసాగిన మోదీ.. పవన్ కళ్యాణ్ కనిపించగానే ఒక్కనిమిషం పాటు అలా ఆగిపోయారు. పవన్ వస్త్రాదారణ చూసిన మోదీ నవ్వుతూ హిమాలయాలకు వెళ్దామనుకుంటున్నావా అంటూ చమత్కరించారు. మోదీ మాటలకు పడిపడి నవ్విన పవన్ కళ్యాణ్ అలాంటిదేమి లేదంటూ సమాధానమిచ్చారు. వెంటనే నీ ముందు చాలా బాధ్యతలు ఉన్నాయి.. వాటిని చూసుకో అంటూ మోదీ పవన్ కళ్యాణ్ చేతిలో చేయి వేసి పలకరించారు. మోదీ మాటలకు పవన్ కళ్యాణ్ వెనుక ఉన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సైతం నవ్వుతూ కనిపించారు. వేదికపై ఉన్నవారందరికి నమస్కరిస్తూ ముందుకుసాగిన మోదీ పవన్ వద్ద కొద్దిసేపు ఆగి.. ప్రత్యేకంగా మాట్లాడటంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌పై మోదీ మరోసారి తన అభిమానాన్ని చూపించారంటూ జనసైనికులు కామెంట్స్ చేస్తున్నారు. అయితే వేదికపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వస్త్రధారణ చూసి పీఎం మోదీ సైతం ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పోరాడుతుందని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా హిందూ ఆలయాల పరిరక్షణ కోసం ప్రత్యేక సనాతన బోర్డు ఏర్పాటుచేయాలనే డిమాండ్‌ను పవన్ వినిపిస్తున్నారు. దీంతో పవన్ కళ్యాణ్ పేరు దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. సినీ నటుడిగా దేశవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న పవన్ కళ్యాణ్.. రాజకీయంగానూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మొత్తానికి పవన్ కల్యాణ్‌ను ప్రధాని మోడీ పలకరించడం.. దానికి నవ్వుతూ పవన్ కల్యాణ్ సమాధానం ఇచ్చిన వీడియో వైరల్‌గా మారిపోయింది..అయితే, సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్ ఫ్యాన్స్, జనసైనికులు ఆ వీడియోను షేర్ చేస్తూ.. అది పవన్ రేంజ్.. ప్రధాని మోడీ.. పవన్ కల్యాణ్‌కు ఇచ్చే గౌరవం అంటూ కామెంట్లు పెడుతున్నారు..

# కృష్ణాజలాలపై మొదటి ద్రోహి కేసీఆర్

(మొదటి తరువాయి)

చేపల పులుసు, బిర్యానీలు తిని తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. వాస్తవానికి తెలంగాణకు 575 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా..కేసీఆర్ 299 టీఎంసీ లకే ఓకే చెప్పారని, ఈ విషయాన్ని తాను ఆధారాలతో సహా బయటపెట్టానని అన్నారు. దీనిపై ఇప్పటి వరకు కేసీఆర్ సమాధానం చెప్పలేదని అన్నారు. ఎస్ఎల్బీసీ ప్రారంభం కాకపోవడాని కి కారకులెవరని బండి సంజయ్ ప్రశ్నించారు. కృష్ణా జలాల విషయంలో మొదట గళమెత్తిందే బీజేపీ అని, అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయించినా కేసీఆర్ అబద్దాలు చెప్పా రని అన్నారు. నల్లగొండ, ఖమ్మం, పాలమూరు జిల్లాలకు అన్యాయం జరుగుతుంటే కాంగ్రెస్ నాయకులు కండ్లు మూసుకొని కూర్చున్నారని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్యాండిడే ట్లు కరువయ్యారని, ఇక పార్టీ ఎక్కడుంటుందని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎ స్ చీకటి మిత్రులని అన్నారు. ఢిల్లీకి వెళ్లి కాంప్ర మైజ్ అయ్యారనని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు అనుకూలంగా ఉండేందుకే అభ్య ర్థులను నిలబెట్టకుండా కేసీఆర్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రంలో అన్నిరంగాల అభివృద్ధికి కేందప్రభుత్వం నిధులు ఇస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. రైతులను అన్నివిధాలా కేంద్రం ఆదుకుంటుందని అన్నారు. ఆరు గ్యారెంటీలను తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ స్కీంల్లో ఎన్ని అమలు చేస్తున్నారో దమ్ము ఉంటే చర్చకు సిద్ధమా అని బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. వాళ(గురువారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సిద్ధమా అని ఛాలెంజ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి పోయి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ చిల్లర మాటలు ఇక ఆపు అని హెచ్చరించారు. రేవంత్ మాటాలను ప్రజలు మెచ్చడం లేదని అన్నారు. రేవంత్ తన వైఖరి మార్చుకోవాలని బండి సంజయ్ సూచించారు.

# ఎన్నిక ఏదైనా విజయం మనదే

(మొదటి తరువాయి)

అలాగే బీజేపీ ఎన్డీయే నేతలకు ప్రత్యేక విందు ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. అలాగే ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంతో ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి, ఎన్డీయే పక్షాల సీఎంల సమావేశానికి హాజరుకాలేదు. ఈ సమావేశంలో ప్రభుత్వాల పనితీరు ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎం రేఖాగుప్తా, డిప్యూటీ సీఎం పర్వేష్ సాహెబ్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్తగా సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టిన ఈ ఇద్దరినీ ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు అభినందించారు. ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా, ప్రధాని మోదీ మాట్లాడారు. అభివృద్ధి అజెండాపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయితే మోడీ ఎక్స్‌లో కూడా ఇదే పోస్ట్ చేసారు. ఇక ఎన్నిక ఏదైనా తమదే విజయమని అన్నారు. ఎన్డీయే సమావేశంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఏపీలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి.. రాజధాని అమరావతి పనులు స్థితిగతులను మోదీ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఏపీ అభివృద్ధికి కేంద్రం నుంచి అన్ని విధాలా తోడ్పాటు ఉంటుందని చెప్పగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు చెప్పినట్లు సమాచారం. ఓవైపు ఏపీలో కూటమి నేతల మధ్య విబేధాలు ఉన్నాయంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వైసీపీ నేతలు ఈ తరహా విమర్శలు చేస్తున్నారు. ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం వేదికగా ఈ విమర్శలకు ప్రధాని మోదీ చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. వేదికపై పవన్ కళ్యాణ్, చంద్రబాబుతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇద్దరితో చమత్కరించిన మోదీ మిగతా ఎన్డీయే నేతలతో పోలిస్తే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో కూటమి మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేవనే విషయం స్పష్టమైంది.

# యూనివర్సిటీలపై కేంద్రం కుట్రలు

(మొదటి తరువాయి)

విద్యా, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాల నిర్ణయాలను కేంద్రం గౌరవించాలన్నారు. రాష్ట్రాలు పరిపాలన విభాగాలే కాదు..దేశ పురోగతికి జీవనాడులని భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రం యూనివర్శిటీల్లో రాష్ట్రాల పాత్రను తొలగించాలని చూస్తోంది. నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు రాష్ట్రాలకు హక్కు లేకుండా చేసే కుట్ర చేస్తోంది. ప్రజలకు వ్యవస్థలకు సరిపోయే విద్యాసంస్థలను రాష్ట్రాలే నిర్మించుకుంటాయి. ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి పోలిక ఉండదు. సొంత నిర్ణయాలు లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రం అందించలేదు. రాష్ట్రాలు ఒక ఉమ్మడి లక్ష్యంతో ఐక్యమైనపుడు కేంద్రం తప్పక వినాలి. ఒక రాష్ట్ర విద్యార్థుల నాడి ఆ రాష్ట్రానికి తెలుస్తుంది అని భట్టి అన్నారు.

## స్వర్ణగోపుర కుంభాభిషేకానికి సిఎంకు ఆహ్వానం

(మొదటి తరువాయి)

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి శ్రీశ్రీ సుదర్శనలక్ష్మీనారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురమహా కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానించారు. సిఎంను కలిసిన వారిలో మంత్రి కొండాసురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, యాదగిరిగుట్ట ఆలయ ఈవో, ఆలయ అర్చకులు ఉన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రం అందించారు. ఆలయ పూజారులు సిఎం రేవంత్‌కు ఆశీర్వచనం చేశారు.

## సంపాదకీయం

# సౌర విద్యుత్ పెరిగితేనే సమస్యకు పరిష్కారం !

మార్చి రాకముందే రాష్ట్రంలో ఎండలు దంచికొడ్తున్నాయి. ఇటు గృహవినియోగంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలకు విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఎండాకాలం క రెంట్ వినియోగం పెరగగలదని అంచనాలు ఉన్నాయి. అయితే డిమాండ్‌కు తగ్గట్లుగా ఉత్పత్తి సామర్థ్యం ఇంకా పెరగలేదు. రెండు రాష్ట్రాల్లోనూ పవర్ ప్రాజెక్టులు అందుబాటులోకి రావాల్సి ఉంది. పిఎం సూర్య ఘర్ యోజనకింద ఇప్పుడిప్పుడే ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్ కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ప్రభుత్వాలు కూడా పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ప్రోత్సహిస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు, ఉత్పత్తి పెరిగి, గ్రామాలకు రక్షగా ఉంటుంది. అయితే ఈ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన రావాల్సి ఉంది. అలాగే పెద్దపెద్ద కమ్యూనిటీలు సౌర విద్యుత్ ఫలకాలు వాడకాన్ని తప్పనిసరి చేయాల్సి ఉంది. అలాగే ఉచిత విద్యుత్ కారణంగా వ్యవసాయ విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోంది. వ్యవసాయ విద్యతు÷−÷−పై అజమాయిషీ, ఆడట్ లేకపోవడంతో అక్కడ ఎంత ఖర్చు చేస్తున్నారన్న దానికి సమాధానం లేదు. ఎపిలో స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ వినియోగం అంచనా వేయాలన్న ప్రయత్నాలపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన వెనక్కి పోయింది. ఇకపోతే వ్యవసాయ విద్యుత్ ఇతర రంగాలకు వినియోగి స్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరికి ఎంత పొలం ఉంది..ఏయే పంటలు పండిస్తున్నారన్న ఆడిట్ కూడా జరగడం లేదు. పంటలకు అనుగుణంగా విద్యుత్ వాడకం ఎంత జరిగిందన్న దానికి లెక్కలు లేవు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే సమస్య ఉంది. ఇకపోతే ఇప్పటికే వరుసగా కోతలు అవస్థలు పెడుతున్నాయి. అప్రకటిత కరెంట్ కోతలు చికాకు కలిగిస్తున్నాయి. తెలంగాణలో అప్రకటిత కోతలు నడుస్తున్నాయి. ఎప్పుడు సడన్‌గా కరెంట్ పోతుందో తెలియడం లేదు. కరెంట్ వినియోగంలో ముందున్న తెలంగాణ రాష్ట్రం.. ఉత్పత్తిలో మాత్రం వెనుకబడిపోయింది. దీంతో బయట ఎక్కువ రేటు పెట్టి కరెంట్ కొనాల్సిన పరిస్థితి నెలకొంది. గత పదేండ్లలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రతిరోజు సగటున 300 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం పడుతుండగా, అందులో మన దగ్గర ఉత్పత్తి అయ్యేది115 మిలియన్ యూనిట్లు మాత్రమేనని తెలుస్తోంది. మిగిలిన 185 మిలియన్ యూనిట్లు అంటే 60 శాతానికి పైగా ఇతర రాష్ట్రాలు, పవర్ ఎక్ఛేంజ్‌ల నుంచి కొనాల్సి వస్తున్నది. విద్యుత్ డిమాండ్ పెద్దగా లేని సమయాల్లో యూనిట్‌కు రూ.2.50 రేటుతో కరెంట్ దొరుకుతున్నప్పటికీ.. డిమాండ్ పీక్స్‌కు చేరే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో యూనిట్‌కు రూ.10 నుంచి రూ.20 దాకా పెట్టి కొనాల్సి వస్తున్నది. దీని వల్ల ఈ మూడు నెలల కాలంలో మన విద్యుత్ పంపిణీ సంస్థలపై, తద్వారా రాష్ట్రంపై రూ.3వేల కోట్లకుపైగా అదనపు భారం పడనుంది. గతేడాది మార్చి 8న అత్యధికంగా 15,623 మెగావాట్ల డిమాండ్?నమోదు కాగా, ఈసారి ఫిబ్రవరి10వ తేదీనే 15,998 మెగావాట్ల డిమాండ్ తో గత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఈసారి యాసంగి సాగు విపరీతంగా పెరగడంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో డిమాండ్ 17వేల మెగావాట్లకు చేరుకుంటుందని విద్యుత్ శాఖ అంచనా వేస్తున్నది. కొద్ది రోజులుగా రాష్ట్రంలో 300 మిలియన్‌యూనిట్ల దాకా వినియోగం జరుగుతుండగా, అందులో మన దగ్గర ఉత్పత్తి అయ్యేది కేవలం 115 మిలియన్ యూనిట్లు మాత్రమే. తెలంగాణ జెన్‌కో విద్యుత్‌కేంద్రాల నుంచి 82ఎంయూలు, సింగరేణి నుంచి 27ఎంయూలు, హైడల్ ద్వారా8 ఎంయూలకు అటు ఇటుగా ఉత్పత్తి జరుగుతున్నది. దీంతో సెంట్రల్‌జనరేటింగ్ స్టేషన్ సహా వివిధ పవర్ ఎక్ఛేంజీల నుంచి సుమారు 185 ఎంయూల దాకా కొనాల్సి వస్తున్నది. తెలంగాణ ఏర్పడే నాటికి జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 5,405 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం 7,285 మెగావాట్లకు చేరింది. అంటే గడిచిన పదేండ్లలో జెన్‌కో సామర్థ్యం కేవలం 1,880 మెగావాట్లు మాత్రమే పెరిగింది. తెలంగాణ వచ్చాక 1,080 మెగావాట్ల కెపాసిటీతో భద్రాద్రి థర్మల్ ప్లాంట్, 4వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి పవర్ ఎ÷−లాంట్ల నిర్మాణాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. వీటిలో ప్రస్తుతం భద్రాద్రిలోని1,080 మెగావాట్ల థర్మల్ ప్లాంట్?తో పాటు యాదాద్రిలోని 5 యూనిట్లలో 800 మెగావాట్ల ఒక యూనిట్ మాత్రమే పూర్తయింది. దీంతో కొత్తగా కేవలం1,880 మెగావాట్ల పవర్ అందుబాటు లోకి వచ్చింది.ప్రస్తుతం జెన్‌కో సామర్థ్యం 7,285 మెగావాట్లు కాగా.. డిమాండ్ మాత్రం 15వేల మెగావాట్లను దాటుతుండడంతో బయట కొనుగోలు చేయక తప్పడం లేదు. గత డిసెంబర్, జనవరి నెలల్లో ఒక్కో యూనిట్‌కు సరాసరి రూ.2.69 నుంచి రూ.2.89 మధ్య పవర్ ఎక్ఛేంజీల నుంచి టీజీ ట్రాన్స్‌కో కరెంట్ కొనుగోలు చేసింది. ఇలా డిమాండ్ పెద్దగా లేనప్పుడు యూనిట్‌కు సగటున రూ.2.50కు దొరికే కరెంట్.. డిమాండ్ ఎక్కువగా ఉండే రాబోయే మూడు నెలల్లో యూనిట్ రేటు రూ.10 నుంచి రూ.20 దాకా చేరవచ్చని ట్రాన్స్‌కో అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఇండియన్ ఎనర్జీ ఎక్ఛేంజ్ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో అమ్ముతున్న కరెంట్‌లో 90 శాతానికి పైగా తెలంగాణే కొంటున్నది. ఎండాకాలం మొదలై మిగతా రాష్ట్రాలు కూడా పోటీ పడితే పవర్‌ఎక్ఛేంజీలో ధరలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ఆయా నెలల్లో విద్యుత్ కొనుగోళ్లపై ఏకంగా ప్రతినెలా రూ.వెయ్యి కోట్ల చొప్పున రూ.3వేల కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో సౌర విదయుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తితో గ్రీన్ ఎనర్జీకి అవకాశాలు ఉన్నాయి. ఇటీవల ఎపి సిఎం చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టారు. దీనిని పెంచుకోగలిగితే విద్యుత్ రంగం స్వయం సమృద్ధి సాధించగలదు.

# పేరుకే స్వదేశీ!

అమెరికాకు చెందిన ఇ.వి (ఎలక్ట్రిక్ వెహికల్స్) దిగ్గజం టెస్లా భారత్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తోంది. ఢిల్లీ, ముంబై కేంద్రాలుగా 13 రకాల ఉద్యోగాలకు ఆ సంస్థ విడుదల చేసిన నోటిఫికేషన్ ఇప్పుడు మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రస్తుతానికి ఆ సంస్థ భారత్‌లో షోరూమ్‌లు మాత్రమే ఏర్పాటు చేయనుందని అర్థమవుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల జరిపిన అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా వ్యవస్థాపకుడు, అమెరికన్ టెక్ బిలియనీర్ ఎలన్ మస్క్‌తో సమావేశం అయిన సంగతి తెలిసిందే. ఎలన్ మస్క్‌కు, అమెరికా అధినేత ట్రంప్‌నకు ఉన్న సన్నిహిత సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో మోడీ పర్యటన తరువాత భారత్‌లో వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడానికి టెస్లా సిద్ధం కావడం ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో స్వదేశీ ఇ.వి పరిశ్రమ భవిష్యత్ కూడా చర్చనీయాంశంగా మారింది. మోడీ అమెరికా పర్యటనకు ముందే ఎలక్ట్రిక్ కార్లపై 110 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని భారత ప్రభుత్వం 70 శాతానికి తగ్గించింది. దాదాపుగా అదే సమయంలో మోడీకి అత్యంత సన్నిహితుడైన భారత కార్పొరేట్ దిగ్గజం అదానిపై అమెరికాలో నమోదైన కేసులకు సంబంధించి చట్టసవరణకు ట్రంప్ నిర్ణయించడం గమనార్హం. మొత్తంమీద మోడీ పర్యటన అటు ఎలన్ మస్క్‌కు, ఇటు అదానికి ఉభయ తారకంగా మారడం కీలకమైన అంశం ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో విస్తారమైన మార్కెట్ అవకాశాలున్న భారత్‌పై టెస్లా దృష్టి ఇప్పటిది కాదు. కొన్ని సంవత్సరాల నుండి ఆ సంస్థ అధినేత ఎలన్ మస్క్ ఈ దిశలో ప్రయత్నాలు చేస్తున్నారు. దిగుమతి చేసుకునే ఇ.వి కార్లపై భారత ప్రభుత్వం విధించే సుంకాలు ఆ ప్రయత్నాలకు తీవ్ర ఆటంకంగా మారాయి. 2021లో దీనిపై ఆయన బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. టెస్లా తన వాహనాలను భారత్‌లో విడుదల చేయాలని భావిస్తోందని, అయితే ప్రపంచంలో ఎక్కడా లేనంత సుంకాలు అక్కడ ఉన్నాయని ఆయన ట్విట్టర్లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆ




అడ్డును కూడా మోడీ సర్కారు తొలగించడంతో భారత్‌లో టెస్లా ప్రవేశానికి మార్గం సుగమమైంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లో తీవ్ర పోటీని ఎదుర్కుంటూ, అమ్మకాలు కూడా క్షీణిస్తున్న సమయంలో టెస్లా భారత్‌లోకి అడుగు పెడుతుండటం గమనార్హం. పన్నెండేళ్ల తరువాత టెస్లా కార్ల అమ్మకాలు గత ఏడాది మొదటిసారి తగ్గాయి. 2023తో పోలిస్తే 2024లో 1.1శాతం అమ్మకాలు క్షీణించినట్లు తేలింది. చైనాకు చెందిన బివైడి నుండి టెస్లా తీవ్ర పోటీ ఎదుర్కుంటోంది. గత ఏడాది టెస్లా ప్రపంచవ్యాప్తంగా 17.9 లక్షల యూనిట్ల ఎలక్ట్రిక్ కార్లను విక్రయించగా, బివైడి 17.6 లక్షల యూనిట్లను అమ్మింది.నంబర్-1 ర్యాంకును నిలబెట్టుకోవడానికి మూడు, నాలుగు సార్లు టెస్లా ధరలు తగ్గించినప్పటికీ అమ్మకాల క్షీణత కొనసాగింది. ఫోర్డ్, జనరల్ మోటార్స్, నిస్సాన్ వంటి సంస్థలతో పాటు రివియన్, లూసిడ్ మోటార్స్ వంటి స్టార్టప్‌లు కూడా టెస్లాకు పోటీగా నిలిచి, మార్కెట్ వాటాను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైనా సంస్థ బివైడి ఈ ఏడాది టెస్లాను అధిగమించే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో భారత మార్కెట్ తలుపులు తెరుచుకోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ గణనీయంగా పెరుగుతోంది. 2023లో ఈ మార్కెట్ 8.03 బిలియన్ డాలర్లుగా ఉండగా, ప్రస్తుత సంవత్సరానికి 54.41, 2029 నాటికి 110.74 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా! మరోవైపు కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గింపుతో పాటు, అనేక రాయితీలు కూడా ఇస్తోంది. ఈ అవకాశాలను వినియోగించుకోవడానికి టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టివిఎస్ మోటార్, హీరో ఎలక్ట్రిక్ వంటి భారతీయ పరిశ్రమలు ప్రయత్నాలు చేస్తున్నాయి. బెంగళూరు ప్రధాన కార్యాలయంగా ఉన్న ఓలా ఎలక్ట్రిక్ సంస్థ కూడా కార్ల తయారీ పట్ల ఆసక్తి ప్రకటించింది. ఈ ప్రయత్నాల ప్రారంభ దశలోనే టెస్లా వంటి నెం.1 అంతర్జాతీయ సంస్థతో పోటీ పడాల్సిన పరిస్థితి ఈ సంస్థలకు ఏర్పడింది. మొత్తంమీద, 'మేక్ ఇన్ ఇండియా..స్వదేశీ ' అంటూ జపం చేసే మోడీ ప్రభుత్వ మాటలకు, చేతలకు పొంతన ఉండదన్న విషయం టెస్లాకు రెడ్ కార్పెట్ పరవడంతో మరోమారు స్పష్టమైంది.

# వీసీలను ముఖ్యమంత్రులే ఎందుకు నిర్ణయించాలి?

విశ్వవిద్యాలయాల ఉపకులపతులను ఎంపిక చేయడానికి గాను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జనవరి 7న కొత్త నియమాలను విడుదల చేసింది. ఇకపైన దేశం మొత్తంలో వీసీల ఎంపిక ఈ నియమాల ప్రకారమే జరగాలని, లేకుంటే ఆ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఉండదని, అంతేగాక యూజీసీ నుంచి నిధులు ఉండవని, అసలు ఉన్నత విద్యాసంస్థల జాబితా నుంచే ఆ విశ్వవిద్యాలయాలను తొలగిస్తామని యూజీసీ స్పష్టంగా చెప్పింది. ఈ కొత్త నియమాల ప్రకారం వీసీలను ఎంపిక చేసే సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీని ఆయా రాష్ట్రాల గవర్నర్లు నియమిస్తారు. ఇందులో ముగ్గురి నుండి ఐదుగురు సభ్యులు ఉండవచ్చు. వీసీల ఎంపికకు దేశవ్యాప్త నోటిఫికేషన్ వస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పది సంవత్సరాల అనుభవం ఉండాలి. కేవలం ప్రొఫెసర్లు మాత్రమే కాకుండా పరిశ్రమల రంగంలో కాని ఇతర విద్యా కళా శాస్త్ర రంగాలలోని సంస్థలలో పది సంవత్సరాలపాటు పనిచేసిన ప్రతిభావంతులైనవారు, అనుభవజ్ఞులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి 65 సంవత్సరాల లోపున ఉండాలి లేదా 70 సంవత్సరాల లోపున పదవి ముగియాలి. రెండోసారి కూడా ఎంపిక కావచ్చు. ఇవి వీసీల నియామకానికి నిర్ణయించిన నియమాలు, అర్హతలు. ఈ కొత్త నియమాలపైన మిశ్రమ స్పందన వచ్చింది. ఇది రాష్ట్రాలకు ఉన్న అధికారాలను తీసివేసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం చేతిలోనికి తీసుకోవడమని, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమని వేరు వేరు రంగాల ప్రముఖులు విమర్శించారు. ప్రొఫెసర్ల నుండి కూడా ఒక పక్షం నుండి విమర్శలు వచ్చాయి. ముఖ్యమంత్రులు కొందరు వ్యతిరేకించారు. కాని ఒక రకంగా చూస్తే ఈ నియమాలు ఇంతకుముందు వాటికన్నా మంచివేనని చెప్పడానికి వీలుంది. ప్రధానంగా రాష్ట్రాలలో ఉన్న మితిమీరిన రాజకీయ జోక్యాన్ని ఇది తగ్గిస్తుందని గట్టిగా చెప్పవచ్చు. ఇప్పటిదాకా ఉన్న నియమాల ప్రకారం వీసీల ఎంపిక నోటిఫికేషన్‌కు స్పందించి దరఖాస్తు చేసుకున్నవారి నుంచి ఎంపిక చేస్తున్నారు. సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ ముగ్గురు సభ్యులతో ఉంటుంది. ఒక సభ్యుడు ఆ యూనివర్సిటీకి చెందిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థి, మరొకరు యూజీసీ నామినీ, ఇంకొకరు రాష్ట్ర ప్రభుత్వం తరపున సభ్యుడు ఉంటారు. ఈ సభ్యుడు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి కానీ లేదా మరొక తుల్యమైన అధికారి కాని కావచ్చు. వీరు వచ్చిన దరఖాస్తుల




నుండి ముగ్గురు అభ్యర్థుల జాబితాను ఎంపిక చేసి గవర్నర్‌కి పంపిస్తే అందులో ఒక పేరును గవర్నర్ ఎంపిక చేస్తే, ఆ వ్యక్తి వీసీగా నియమితుడు అవుతాడు. ఇది జరగవలసిన పద్ధతి. కానీ ఈ జరగవలసిన పద్ధతిలో ఎప్పుడూ జరగలేదు. పోలీస్ విచారణ ద్వారా అభ్యర్థుల ఉద్యోగ వ్యక్తిగత నేపథ్యాలను, అతని కార్యనిర్వహణ దక్షత, నిజాయితీ వగైరా వివరాలను సేకరించి దాని ఆధారంగా జాబితాను కుదిస్తారు. వారిలో నుండి ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సెర్చ్ కమిటీ అనే పేరు వచ్చిన కారణం ఒకటి ఉంది. గొప్ప వ్యక్తులు కాని లేదా ఆయా రంగాలలో గొప్ప సేవలు చేసినవారు కాని దరఖాస్తు చేసుకోకపోయినా కూడా అటువంటి నిపుణులను సెర్చ్ కమిటీ ఎంపిక చేసి గవర్నర్‌కి పంపించవచ్చు. అందుకే దీన్ని 'సెలక్షన్' కమిటీ అని మాత్రమే అనకుండా 'సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ' అన్నారు. కానీ ఇలాంటి అవకాశాన్ని ఏ కమిటీ కూడా ఉపయోగించుకున్న దాఖలాలు తెలుగు రాష్ట్రాలలో కాని ఇతర రాష్ట్రాలలో కాని కనిపించవు. ఈ దరఖాస్తు పద్ధతి లేని పూర్వపు రోజులలో ప్రభుత్వం రాజకీయ జోక్యం లేకుండా ఇలాంటి గొప్పవారిని, నిపుణులను వీసీలుగా ఎంపిక చేశాయి. జడ్జీలు, గొప్ప శాస్త్రవేత్తలు అలా వీసీలుగా ఎంపికైనారు. ఆ మంచి రోజులను నేడు ఊహించలేము. నేడు జరుగుతున్న ఎంపిక ఈ నియమ నిబంధనలు అన్నింటినీ తుంగలో తొక్కి పూర్తిగా రాజకీయమయంగా సాగుతున్నది. ముఖ్యమంత్రులే నేరుగా జోక్యం చేసుకొని వారికి నచ్చిన అభ్యర్థి పేరును ప్రభుత్వ నామినీ ద్వారా సెర్చ్ కమిటీలోకి తెచ్చి తక్కిన రెండూ డమ్మీ పేర్లు పెట్టించి ఆ ముగ్గురు అభ్యర్థుల జాబితాని గవర్నర్‌కి పంపించడం, ప్రభుత్వం విషయంలో నేనెందుకు జోక్యం చేసుకోవడం అని గవర్నర్లు ప్రభుత్వ ప్రతినిధి సూచించిన వ్యక్తినే వీసీగా ఎంపిక చేసి పంపించడం అనే ప్రహసనం దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ జరుగుతున్నది. ఈ రాజకీయ జోక్యం అన్నిటికన్నా తమిళనాడులోనే ఎక్కువ ఉందని వార్తలు వచ్చాయి. అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ కొత్త నియమాలను పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రకటన చేశారు. ఈ రాజకీయ తంతు వేర్వేరు రాష్ట్రాలలో ఎన్ని రకాలుగా ఉందో ఇక్కడ ఒకసారి గమనించవచ్చు. ఒక కులసంఘం నాయకుడు తమ ప్రాపకంలోని ఒక ఆచార్యుని తమ కులానికే చెందిన లేదా తన జిల్లాకే చెందిన మంత్రివర్యుని వద్దకు తీసుకుపోయి మన అభ్యర్థిని వీసీని చేయాలని కోరడం, సదరు మంత్రి ముఖ్యమంత్రితో ఆ పని చేయించడం ఒక పద్ధతి. లేదా ఒక మంత్రే తమ అభ్యర్థిని ఏ విధమైన ప్రభావంతోనైనా, ప్రాధాన్యంతోనైనా సరే ఎంపిక చేసుకొని ముఖ్యమంత్రితో ఎంపిక చేయించడం ఇంకో పద్ధతి. ముఖ్యమంత్రి ఆశీస్సులే ఒక అభ్యర్థికి నేరుగా ఉండి ఎంపిక కావడం మరో పద్ధతి. ఈ క్రమంలోనే వీసీలుగా అగ్రకులాలవారు కొందరు, బీసీలు కొందరు, మైనారిటీలు కొందరు, ఎస్సీ ఎస్టీలు కొందరు ఎంపిక అవుతారు. మేము సామాజిక న్యాయాన్ని పాటించి అభ్యర్థులను ఎంపిక చేశాం అని ప్రభుత్వాలు గర్వంగా చెప్పుకుంటాయి. కానీ అసలు పాటించింది తమకు కావలసిన రాజకీయ న్యాయాన్ని. ఒక మంత్రిగారు "నా జిల్లాలో వీసీ పదవిని నాకు తెలియకుండా, నేను చెప్పిన వారికి కాకుండా ఎలా ఎంపిక చేస్తారు" అన్నారట! ఈ క్రమంలో నిపుణులైనవారు, పరిపాలన అనుభవం ఉన్నవారు, విజ్ఞులైనవారు కాకుండా, అయోగ్యులైన వారు ఎంపిక కావడం చాలాసార్లు జరిగింది.

# అడ్వకేట్స్ సవరణ బిల్లు- 2025 పై "తీవ్ర ఆందోళనలు






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

అడ్వకేట్స్ సవరణ బిల్లు- 2025 పై "తీవ్ర ఆందోళనలు" వ్యక్తం చేస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (BCI ) కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. న్యాయవాద వృత్తికి తీవ్రమైన చిక్కులు, కౌన్సిల్ స్వయంప్రతిపత్తికి ముప్పు ఉందని పేర్కొంటూ ఈ బిల్లుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది.

కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 13న న్యాయవాదుల (సవరణ) బిల్లు-2025ను ప్రజల నుండి అభిప్రాయాలను ఆహ్వానిస్తూ పంపిణీ చేసింది.

ప్రతిపాదిత ముసాయిదా న్యాయవాదుల సవరణ బిల్లు, 2025 గురించి తన తీవ్ర ఆందోళనలను వ్యక్తం చేయడానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చిందన్నారు. ముసాయిదా బిల్లులోని బహుళ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, వాటిని వెంటనే సరిదిద్దాల్సిన అవసరం ఉందని బార్ కౌన్సిల్ నొక్కి చెప్పింది. లా సెక్రటరీ మరియు చీఫ్ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్‌తో అనేక రౌండ్ల చర్చలు జరిగినప్పటికీ, తుది ముసాయిదాలో గతంలో అంగీకరించిన నిబంధనల నుండి వైదొలిగిన "ఏకపక్షంగా చొప్పించడం" ఉందని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ మిశ్రా హైలైట్ వ్యాఖ్యలుచేశారు.

మనన్ కుమార్ మిశ్రామనన్

"ముసాయిదా ప్రచురణలో కొంతమంది అధికారులు మరియు న్యాయ మంత్రిత్వ శాఖ అనేక ముఖ్యమైన మార్పులు చేయడం దిగ్భ్రాంతికరం " అని అన్నారు. ఈ ముసాయిదా "బార్ కౌన్సిల్ యొక్క స్వయంప్రతిపత్తి, స్వాతంత్ర్య భావననే కూల్చివేయడానికి" ప్రయత్నిస్తుందన్నారు. భారతదేశం అంతటా న్యాయ సమాజం ఆందోళన చెందుతున్నదని, నిరసనలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని ఆయన అన్నారు.

' దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళన చెందుతున్నారు, బలమైన నిరసన తప్పదు. ఢిల్లీ జిల్లా కోర్టుల న్యాయవాదులు ఇప్పటికే సమ్మె చేశారు.న్యాయ మంత్రిత్వ శాఖ నుండి త్వరలో సానుకూల హామీ లభించకపోతే న్యాయవాదుల నిరసన దేశవ్యాప్తంగా వ్యాపించే అవకాశం ఉంది " అని హెచ్చరించారు

## బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యొక్క ఆందోళనలు ఏమిటి?

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో ప్రభుత్వ నామినీలు [సెక్షన్ 4(1)(d)]0 – ముసాయిదా బిల్లు కేంద్ర ప్రభుత్వానికి బార్ కౌన్సిల్ కి ముగ్గురు సభ్యులను నామినేట్ చేయడానికి అనుమతిస్తుంది, ఈ చర్యను బార్ కౌన్సిల్ అత్యంత "క్రూరమైన నిబంధన"గా పేర్కొది. సమావేశాలలో దీని గురించి ఎప్పుడూ చర్చించలేదని మరియు "ఏకపక్షంగా చేర్చబడిందని" బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పేర్కొంది.

విదేశీ న్యాయవాదులు న్యాయ సంస్థల నియంత్రణ – విదేశీ న్యాయవాదులు, న్యాయ సంస్థలపై నియంత్రణ అధికారాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి కేంద్రానికి మార్చడానికి ప్రతిపాదించిన ప్రతిపాదనపై బార్ కౌన్సిల్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎ.కె. బాలాజీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ఇది విరుద్ధంగా ఉందని కౌన్సిల్ వాదిస్తుంది. ఈ బాధ్యత బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకి అప్పగించబడింది. విదేశీ న్యాయ నిపుణుల ప్రవేశాన్ని నియంత్రించడానికి 2022లో ఇప్పటికే సమగ్ర నిబంధనలను రూపొందించామని మరియు ఈ అధికారం బార్ కౌన్సిల్ తోనే ఉండాలని అది పట్టుబడుతోంది. మొత్తం న్యాయవాద వృత్తిని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నియంత్రించాలి, నిర్వహించాలి, అప్పుడు విదేశీ న్యాయవాదులు మరియు న్యాయ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఎందుకు మరియు ఎలా నిర్వహించగలదు " అని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసే అధికారం (సెక్షన్ 49 B ) – ముసాయిదా బిల్లు కేంద్రానికి %దీజ×%కి కట్టుబడి ఉండే ఆదేశాలను జారీ చేయడానికి అధికారం ఇస్తుంది, ఈ నిబంధనను కౌన్సిల్ "పూర్తిగా ఆమోదయోగ్యం కాదు" అని భావిస్తుంది. ఇది న్యాయవాద వృత్తి యొక్క స్వీయ-నియంత్రణకు అవసరమైన దాని స్వయంప్రతిపత్తి మరియు స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని బార్ కౌన్సిల్ వాదిస్తుంది. నమోదు అర్హత మరియు రుసుము నిర్మాణం (సెక్షన్ 24) – నమోదు రుసుము నిర్మాణంలో మార్పులపై బార్ కౌన్సిల్ అభ్యంతరం వ్యక్తం చేసింది, దీని వలన బార్ కౌన్సిల్ కి బదులుగా కేంద్ర ప్రభుత్వం రుసుములను నిర్ణయించవచ్చు. ద్రవ్యోల్బణం ఆధారంగా కాలానుగుణ సవరణలతో రాష్ట్ర బార్ కౌన్సిల్‌లకు ?18,000 మరియు బార్ కౌన్సిల్ కి ?3,000 స్థిర రుసుమును కౌన్సిల్ ప్రతిపాదించింది. అయితే, ముసాయిదా బిల్లు ఫీజు నిర్మాణాన్ని పూర్తిగా ప్రభుత్వానికి వదిలివేస్తుంది, ఇది ఏకపక్ష మార్పులు మరియు గందరగోళానికి దారితీయవచ్చని బార్ కౌన్సిల్ పేర్కొంది 'న్యాయవాద నిపుణుడు" యొక్క నిర్వచనం – కోర్టులు, ట్రిబ్యునళ్లు లేదా సలహా పాత్రలలో చట్టపరమైన ఆచరణలో నిమగ్నమైన అన్ని వ్యక్తులు మరియు సంస్థలను చేర్చాలని ప్రతిపాదించే "న్యాయవాద నిపుణుడు" యొక్క నిర్వచనాన్ని ముసాయిదా బిల్లు నీరుగార్చిందని బార్ కౌన్సిల్ విమర్శించింది. ముసాయిదా బిల్లు యొక్క అస్పష్టమైన ప్రమాణాలు లొసుగులను సృష్టించగలవని, విదేశీ చట్టపరమైన సంస్థల ద్వారా నియంత్రించబడని పద్ధతులను అనుమతించవచ్చని కౌన్సిల్ వాదిస్తుంది. "చట్ట సాధన" నిర్వచనం తొలగింపు – వ్యాజ్యాలు మరియు వ్యాజ్యాలు లేని చట్టపరమైన పనులను చేర్చడానికి "చట్ట సాధన" యొక్క సమగ్ర నిర్వచనాన్ని బార్ కౌన్సిల్ ప్రతిపాదించింది. ముసాయిదా బిల్లు ఈ నిర్వచనాన్ని విస్మరించింది, ఇది అస్పష్టతకు మరియు క్రమబద్ధీకరించని పద్ధతులకు దారితీస్తుందని కౌన్సిల్ విశ్వసిస్తుంది, ముఖ్యంగా విదేశీ చట్టపరమైన సంస్థల ద్వారా రాష్ట్ర జాబితా నుండి న్యాయవాదుల తొలగింపు (సెక్షన్ 24B) – మూడు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడిన నేరాలకు పాల్పడిన న్యాయవాదులను రాష్ట్ర జాబితా నుండి తొలగించాలని ముసాయిదా బిల్లు ప్రతిపాదించింది. ప్రస్తుత నిబంధన చాలా కఠినమైనదని మరియు న్యాయవాదులను అన్యాయంగా శిక్షించవచ్చని వాదిస్తూ, ఈ పరిమితిని ఏడు సంవత్సరాలకు పెంచాలని బార్ కౌన్సిల్ సూచించింది. సంక్షేమ నిబంధనల తొలగింపు – బార్ కౌన్సిల్ న్యాయవాదుల రక్షణ మరియు సంక్షేమంపై కొత్త అధ్యాయాన్ని ప్రతిపాదించింది, దీనిని ముసాయిదా బిల్లు నుండి తొలగించారు. హింస, వేధింపులు మరియు హానికరమైన ప్రాసిక్యూషన్ నుండి న్యాయవాదులకు చట్టబద్ధమైన రక్షణల అవసరాన్ని, అలాగే పెన్షన్లు, భీమా మరియు ఆరోగ్య సంరక్షణతో సహా న్యాయవాదుల సంక్షేమ పథకాల అవసరాన్ని కౌన్సిల్ నొక్కి చెప్పింది. సమ్మెలు మరియు బహిష్కరణలు –బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకారం, ముసాయిదా బిల్లులో ప్రతిపాదించినట్లుగా సమ్మెలు/బహిష్కరణలను విడిగా పరిగణించలేము. కోర్టు ధిక్కార చట్టం కింద కోర్టులకు ఇప్పటికే అంతరాయాలను పరిష్కరించడానికి అధికారం ఉందని, సెక్షన్ 35 కింద అటువంటి చర్యలను దుష్ప్రవర్తనగా వర్గీకరించడం అనవసరమని వాదించింది. అందువల్ల, సమ్మెలు మరియు బహిష్కరణలను పరిష్కరించే సెక్షన్లు 26(సి) మరియు (డి)లను తొలగించాలని కోరింది. సెక్షన్ 48 B (2) (ఆదేశాలు ఇచ్చే అధికారం) కు సవరణ – బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకారం, ప్రస్తుత చట్టం రాష్ట్ర బార్ కౌన్సిల్‌లను పర్యవేక్షించడానికి మార్గనిర్దేశం చేయడానికి అధికారం ఇస్తుంది. రాష్ట్ర బార్ కౌన్సిల్ పనిచేయలేనప్పుడు జోక్యం చేసుకోవడానికి మాజీ హైకోర్టు న్యాయమూర్తి మరియు నలుగురు సీనియర్ న్యాయవాదుల నేతృత్వంలోని కమిటీని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదిత సవరణ ప్రయత్నిస్తుంది. అందువల్ల ఈ నిబంధనను పూర్తిగా తొలగించాలని కోరింది . కొత్త సెక్షన్ 36-%దీ%(3) ను చేర్చడం – రెండు సంవత్సరాలలోపు ఫిర్యాదులను పరిష్కరించడంలో విఫలమైనందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్‌లు క్రమశిక్షణా కమిటీలను శిక్షించాలని ముసాయిదా ప్రతిపాదిస్తుంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకారం, ఈ సంస్థలు క్వాసీ-జ్యుడీషియల్ విధులను నిర్వహిస్తాయి కాబట్టి, కఠినమైన కాలక్రమణికలను మరియు శిక్షలను విధించడం సరికాదు. ఉప-విభాగాన్ని తగిన విధంగా సవరించాలి. "నియమాల" స్థానంలో "నియమాల"ను చేర్చడం – "నియమాల" స్థానంలో "నియమాల"ను చేర్చడం వల్ల బార్ కౌన్సిల్ అధికారాన్ని బలహీనపరుస్తుందని లేఖలో పేర్కొన్నారు.

# గీతం అధ్యాపకుడు రవి హనుమంతుకు డాక్టరేట్



ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 20 పటాన్ చేరు ప్రతినిధి

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని టెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు రవి హనుమంతు డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వివిధ ఆపరేటింగ్ పారామితులలో టెర్నరీ ఇంధనంతో ఇంధనంగా ఉన్న ఆర్ సీసీఐ ఇంజిన్ ప్రవర్తన, వ్యాయామ విశ్లేషణ మెరుగుదల' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. సీతారామయ్య గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు రవి హనుమంతు పరిశోధన అధ్యయనం ప్రకారం, అధునాతన దహన చాంబర్ డిజైన్ తో పాటు, టెర్నరీ ఇంధన మిశ్రమాలు, మెరుగుదల చేసిన ఇంజెక్షన్ పారామితులను ఉపయోగించి, ఆర్ సీసీఐ ఇంజిన్లు ఇంజిన్ సామర్థ్యాన్ని పెంచడానికి, ఉద్గారాలను తగ్గించడానికి స్థిరమైన విధానాన్ని అందిస్తాయి. ఇది వాటిని సాంప్రదాయ డీజిల్ ఇంజిన్ లకు ఆచరణీయమైన, ఆశాజకమైన ప్రత్యామ్నాయంగా చేస్తుంది రవి హనుమంతు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# 100రోజుల క్షయ వ్యాధి కార్యాక్రమం

## పాలుగోన్నా డాక్టర్. సాయినాథ్ రెడ్డి



పెద్దమందడి. ప్రజా స్వేచ్ఛ

పెద్దమందడి మండల పరిధిలోని, మంగంపల్లి గ్రామంలో, మరియు వెల్టూరు గ్రామంలో ఈరోజు క్షయ వ్యాధి వంద రోజులు కార్యక్రమం భాగంగా, మంగంపల్లి గ్రామంలో అనుమానించబడిన 98 వెల్టూరు గ్రామంలో 115 మందికి ఎక్స్ రేలు తీయడం జరిగింది . ఇట్టి కార్యక్రమంలో జిల్లా ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్ రెడ్డి, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ పరిమళ మేడం, వైద్యాధికారి డాక్టర్ మంజుల మేడం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సద్గుణ, గ్రామ ప్రజలు మరియు వైద్య సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# తెలంగాణలో 8 మంది ఐఏఎస్‌లు బదిలీ





–హైదరాబాద్
తెలంగాణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మొత్తం 8 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రవాణ శాఖ కమిషనర్ కె.సురేంద్ర మోహన్‌ను సహకార శాఖ కమిషనర్‌గా, మార్కెటింగ్ డైరక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలను ఐఏఎస్ అధికారి ఉదయ్ కుమార్ నిర్వర్తించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరక్టర్ ఆర్.వి.కర్ణన్‌కు ఆరోగ్యశ్రీ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు అదే పోస్టులో కొనసాగిన శివశంకర్ జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇక ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి కె.హరితను వాణిజ్య పన్నుల శాఖ డైరక్టర్‌గా నియమించారు. ఉద్యాన శాఖ డైరక్టర్ యాస్మిన్ బాషాకు సీడ్స్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హాకా ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ ఫుడ్స్ ఎండీగా, తెలంగాణ ఫుడ్స్ ఎండీగా ఉన్న బి.శ్రీనివాస రెడ్డిని ఆయన మాతృ శాఖ చేనేత జౌళి శాఖకు బదిలీ చేశారు. వనపర్తి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గాంగ్వార్‌ను నారాయణపేట అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా నియమించారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్ యాప్స్




ప్రజా స్వేచ్ఛ కరీంనగర్
ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్, యూట్యూబ్.. ఇలాంటి సామాజిక మాధ్యమాల్లో వేలల్లో, లక్షల్లో సబ్‌స్క్రైబర్లు కలిగి ఉండి వారి పోస్టులకు అదేస్థాయిలో లైక్‌లు, కామెంట్లు వచ్చే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కొన్నాళ్లు ప్రమోషన్ యాడ్స్ చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. అందులోనూ బెట్టింగ్‌యాప్‌లు, రమ్మీ, క్యాసినో, రౌలట్ వంటి గేమ్స్, ఫేక్ ట్రేడింగ్ సైట్లు ప్రమోట్ చేస్తూ ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్నారు. అలా ప్రభావితమైన వాళ్లలో అత్యాశతో కొందరు ఈ ఫేక్ యాప్స్, సైట్లలో అప్పులు చేసి మరీ రూ.లక్షలు పెట్టుబడిపెట్టి పోగొట్టుకుంటున్నారు. అందులో కొందరు నిండా మునిగి.. మళ్లీ అప్పు దొరక్క.. చేసిన బాకీలు తీర్చలేక ప్రాణం తీసుకుంటున్నారు. మూడు వారాల వ్యవధిలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే నలుగురు యువకులు ఆత్మహత్య చేసుకోవడం ఇందుకు అద్దం పడుతోంది.

**సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం..**
వ్యంగ్యాస్త్రాలు, చలోక్తులు, ఫన్నీ వీడియోలు, స్పూఫ్‌లు, గ్రాఫిక్స్ ఫొటోలు, అశ్లీల మాటలు, వీడియోలు.. ఇలా రకరకాలుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ పెద్దఎత్తున ఫాలోవర్స్‌ను సంపాదించుకుంటున్న సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల హవానే ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తోంది. అందులోనూ బూతు కంటెంట్ ఉన్న వారి ఖాతాలనే ఫాలో అవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ మిలియన్లలో సబ్‌స్క్రైబర్లు అవుతున్నారు. ఇప్పుడు అదే ఖాతాల నిర్వాహకులు ఫేక్‌యాప్‌లు, గేమింగ్, ట్రేడింగ్ సైట్లు ప్రమోట్ చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. తమ సోషల్ మీడియా వేదికల్లో 'చేతిలో రూపాయిలేని నువ్వు.. లక్షాధికారి ఎలా అయ్యావురా..! అదా.. అదేం పెద్ద రహస్యమేమీ కాదు.. ఫలానా ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్ ఆడి రూ.లక్షలు సంపాదించా. ఇప్పుడు లగ్జరీకారు, ఇల్లు కొనే స్థాయికి వచ్చా! నువ్వు ఆడు.. నువ్వూ లక్షాధికారి కావొచ్చు!' లాంటి సంభాషణలతో కూడిన ప్రమోషన్ వీడియోలు సోషల్ మీడియాలో ఎక్కువగా చేస్తున్నారు. ఒకవేళ ఆ యాప్ వివరాల కోసం వెబ్‌సైట్ లింక్‌ను ఒకసారి క్లిక్ చేసినా.. సదరు వ్యక్తి ఏ సామాజిక మాధ్యమం తెరిచినా.. ఏ వెబ్‌సైట్‌ను సందర్శించినా.. ఒకపక్క ఆన్‌లైన్ రమ్మీ, క్యాసినో, రౌలట్ లాంటి గ్యాబ్లింగ్ గేమ్స్ అనేకం యాడ్స్ రూపంలో కనిస్తుంటాయి. మరోవైపు ఆ యాప్‌లకు సంబంధించి యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రమోషన్‌కు ప్రభావితం చేస్తుంటాయి. ఆర్థికంగా ఏమీ లేని వ్యక్తి కేవలం బెట్టింగ్, ఇతర ఆన్‌లైన్ గేమ్స్ ఆడి రోజువారీగా సంపాదిస్తున్నట్టుగా బ్యాంక్‌ఖాతాకు సంబంధించి యూపీఐ బ్యాలెన్స్ చెకింగ్ పోస్టులో రూ.వేలు, రూ.లక్షలు జమ అయినట్టుగా చూపుతూ పెడుతున్న పోస్టులు కొందరిని అత్యాశకు గురి చేస్తున్నాయి.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**నిరుద్యోగులు, యువతే ఎక్కువ..**
ఆన్‌లైన్ గేమ్స్ బారిన నిరుద్యోగులు, తొందరగా డబ్బులు సంపాదించాలని ఆశపడే యువతే ఎక్కువగా బలవుతున్నారు. తెలిసిన వ్యక్తుల వద్ద, లోన్‌యాప్స్ ద్వారా డబ్బులు అప్పుగా తీసుకుంటూ ఆయా బెట్టింగ్‌యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్‌లో పోగొట్టుకుంటున్నారు. తీరా మళ్లీ అప్పు దొరక్క, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక కొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారు.నెల రోజుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో

**ఆత్మహత్య చేసుకున్న యువకుల ఉదంతాలివీ..**
– కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన బూస శంకర్ కుమారుడు కార్తీక్(25) కొన్నేండ్లుగా ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడాడు. గేమ్ కోసం రూ.15లక్షల వరకు అప్పు చేశాడు. ఆరు నెలల కింద 20గుంటల పొలం అమ్మి అప్పు తీర్చేశాడు. తరువాత మరోసారి రూ.2.50లక్షలు అప్పు చేసి రమ్మీ ఆడటంతో ఆ డబ్బులు కూడా పోయాయి. దీంతో మనస్తాపానికి గురైన కార్తీక్ జనవరి 30న గ్రామ సమీపంలోని వాగు వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

–ఇదే మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఎడిగ మధు(33) కొన్ని నెలలు ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతూ రూ.10లక్షలకుపైగా పోగొట్టుకున్నా డు. అప్పులు చేసి బెట్టింగ్‌లో పెట్టడంతో అవి చెల్లించలేక కొన్ని రోజులుగా మనోవేదనకు గురయ్యాడు. ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేని టైంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

–పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధి యైంటిన్‌క్లయిన్ కాలనీకి చెందిన చొప్పరి దేవేందర్(35) కార్లను అద్దెకు నడుపుతుండటమే కాకుండా జూలపల్లిలో బిర్యానీ సెంటర్ నిర్వహిస్తు న్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడి రూ.50లక్షలు పోగొట్టుకున్నాడు. రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన దేవేందర్ ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

**ఫేక్‌యాప్‌లను ప్రమోట్ చేసిన వ్యక్తి అరెస్ట్**
సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌కు చెందిన కంసాని ఆకాష్ అనే యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రాజా గేమ్స్ అనే ఫేక్ యాప్‌ను ప్రమోట్ చేశాడు. యువతను ఆకర్షించే విధంగా వీడియోలు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేసి తప్పుదోవ పట్టించసాగాడు. ఆకాశ్‌పై వచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపి ఈనెల 17న పట్టణ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎవరూ ఫేక్ యాప్‌లను నమ్మి డబ్బులు పెట్టి మోసపోకూడదని, ఫేక్ యాప్‌లతో యువతను తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ హెచ్చరించారు.

# మా భవిష్యత్తు కోసం అమరులైన మీకు మా జోహార్లు

– తెలంగాణ అమరవీరుడు సిరిపురం. యాదయ్యకు నివాళులు అర్పించిన చిన్నారులు



వనపర్తి. ప్రజా స్వేచ్ఛ 20.ప్రతినిధి. వనపర్తి.
తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన సిరిపురం యాదయ్య కి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, చిన్నారులతో కలసి తన నివాసంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నందిమల్ల అశోక్, నాగన్న యాదవ్, సమధ్, కంచ రవి, ప్రేమ్ నాథ్ రెడ్డి, స్టార్ రహీమ్, ఇమ్రాన్, మహేశ్వర్ రెడ్డి, ఆరీఫ్, ఏకే.పాషా, జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము, ప్రేమ్ కుమార్, మునేశ్వర్, గ్రీన్ యార్డ్ యూసూఫ్, అలీమ్, శివ లక్ష్మణ్, వజ్రాల రమేష్, తోట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కాపాడండి

– బాలగౌని వెంకటేష్ గౌడ్ టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి
–మహేంద్ర హిల్స్ సర్వేనెంబర్ 14 5 ఎకరాలు 21 గుంటల భూమికి సర్వే చేసి సరిహద్దులు వేయండి
– రెవెన్యూ డిటి రాజేందర్ కు వినతి పత్రం అందజేత



ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 20 ఘట్కేసర్ ప్రతినిధి
మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ మహీంద్రా హిల్స్ సర్వేనెంబర్ 14 ఐదు ఎకరాల 21 గుంటల భూమి సరిహద్దుల కోసం సర్వేయర్ కు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడంతో టిపిసిసి మాజీ అధికార ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పోచారం మున్సిపాలిటీ బాలగౌని వెంకటేష్ గౌడ్ గురువారం తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డిటి రాజేందర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది రెవెన్యూ డిటి మాట్లాడుతూ నేను దాన్ని సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు

# చీకరు చెట్టు తండాలో ఉచిత న్యాయ సహాయం సలహాలపై అవగాహన

మాజీ సర్పంచ్ రాధాకృష్ణ.

పెద్దమందడి. ప్రజా స్వేచ్ఛ 20. ప్రతినిధి. వనపర్తి. వనపర్తి జిల్లా
పెద్దమందడి మండలం చీకరు చెట్టు తండాలో 21వ తేదీ శుక్రవారం ఉచిత న్యాయ సహాయం సలహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని గ్రామ మాజీ సర్పంచ్ రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ అధికార సేవా సంస్థ కార్యదర్శి జిల్లా సీనియర్ న్యాయమూర్తి రజిని ఆధ్వర్యంలో న్యాయ సహాయంపై సలహాలు ,సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు, నిరుపేదలకు, రైతులకు సైతం ఉచిత న్యాయ సహాయం సేవలు అందించేందుకు ,చట్టాలపై అవగాహన ఉచిత న్యాయ సలహాలపై అవగాహన కల్పించనున్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండే విధంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నారని మాజీ సర్పంచ్ రాధాకృష్ణ తెలిపారు. నేడు నిర్వహించే ఉచిత న్యాయ సహాయం సలహాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

# జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కీలక ఆదేశాలు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ
ప్రతి శుక్రవారం జిల్లాలోని ప్రత్యేక అధికారులు,తహసీల్దార్ లు, ఎంపిడిఓలు,క్లస్టర్,నోడల్ అధికారులందరూ రెసిడెన్షియల్ పాఠశాలలు,వసతి గృహాలను సందర్శించి,తనిఖీలు చేపట్టాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.గతంలో అంగన్వాడి కేంద్రాలను పరిశీలించినట్లుగానే ఇప్పుడు కూడా జిల్లా యంత్రాంగమంతా రెసిడెన్షియల్ పాఠశాలలు,వసతి గృహాలను పర్యవేక్షించాలన్నారు.ఉన్నత ప్రమాణలతో కూడిన విద్యకు సహకరించాలన్నారు.

# బిజినెస్

## యూత్‌కు పిచ్చెక్కిస్తున్న టీవీఎస్ బైక్.. లేటెస్ట్ అప్‌డేట్స్‌తో రోనిన్ విడుదల



గతేడాది గోవాలో జరిగిన మోటోసౌల్ ఈవెంట్ లో టీవీఎస్ రోనిన్ బైక్ ను ఆవిష్కరించారు. ప్రస్తుతం అప్ డేట్ చేసిన వెర్షన్ మార్కెట్ లోకి విడుదలైంది. 2025 మోడల్ వెర్షన్ ను రెండు కొత్త రంగులు, భద్రతా ఫీచర్లతో అప్ గ్రేట్ చేశారు. అలాగే డ్యూయల్ చానల్ ఏబీఎస్ ఇప్పుడు మిడ్ స్పెక్ డీఎస్ వేరియంట్ నుంచి అందుబాటులోకి వచ్చింది. గతంలో టాప్ స్పెక్ టీడీ ట్రిమ్ లో మాత్రమే లభించేది. రోనిన్ బైక్ ధర రూ.1.35 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి రూ.1.68 లక్షల వరకూ ఉంటుంది. దీనిలోని స్పెషల్ ఎడిషన్ కూడా మన దేశంలో అందుబాటులో ఉంది. దాని ధరను రూ.1.72 లక్షలుగా నిర్ధారణ చేశారు. ఈ బైక్ లో 225.9 సీసీ సింగిల్ సిలిండర్, ఆయిల్ కూల్డ్ ఇంజిన్ పాత బైక్ మాదిరిగానే ఉన్నాయి. ఇంజిన్ నుంచి 20.1 హెచ్పీ, 19.93 ఎన్ఎం టార్కు విడుదల అవుతుంది. స్లిప్, అసిస్ట్ క్లచ్ తో 5 స్పీడ్ గేర్ బ్యాక్స్ ను జత చేశారు. గత మోడల్ లోని టాప్ వేరియంట్ లో డ్యూయల్ చానల్ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ ఉండేది. ఇప్పుడు కొత్త వెర్షన్ లో దాన్ని తీసుకువచ్చారు. సీటు తో పాటు అనేక వాటిని రీడిజైన్ చేశారు. హెచ్ లైట్ చుట్టూ కొన్ని మార్పులు తీసుకువచ్చారు. ఇక ఇంజిన్ పనితీరు చాలా మెరుగ్గా ఉంటుంది లీటర్ పెట్రోలుకు దాదాపు 42 కిలోమీటర్ల వరకూ మైలేజీ ఇస్తుంది. రైడర్లకు అవసరమయ్యే అనేక ఆధునిక ఫీచర్లను కొత్త బైక్ లో ఏర్పాటు చేశారు. బ్లూటూత్ కనెక్టివిటీ ఉన్న డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్ ఆకట్టుకుంటోంది. దీని వల్ల రైడింగ్ చాలా సులభంగా ఉంటుంది. అలాగే సీటు కూడా చాలా కంఫర్టుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. తక్కువ వేగంతో వెళుతున్నప్పుడు ఇంజిన్ ఆగిపోకుండా ఉండటానికి గ్లైడ్ త్రూ ట్రాఫిక్ ఫంక్షన్ ఉంది. ఏబీఎస్ సిస్టమ్ తో పాటు అడ్జస్ట్ బుల్ క్లచ్, బ్రేక్ లివర్లు, సైడ్ స్టాండ్ కట్ ఆఫ్ సెన్సార్, ఎల్ఈడీ హెడ్ ల్యాంపులు, టెయిల్ ల్యాంపులు, టర్న ఇండికేటర్లను ఏర్పాటు చేశారు. సైలెంట్ స్టార్టర్ ఆప్షన్ దీనికి అదనపు ఆకర్షణగా ఉంటుంది. గతుకుల రోడ్డుపై సుఖంగా, సులభంగా ప్రయాణించేందుకు వీలుగా ముందు యూఎస్డీ ఫోర్కులు, వెనుక మోనోషాక్ సస్పెన్షన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా యువతకు ఆకట్టుకునేలా కొత్త రోనిన్ ను తీర్చిదిద్దారు. ఈ బైక్ కస్టమర్లకు బాగా ఆకట్టుకుంటుందని, మార్కెట్ లో మిగిలిన బైక్ లకు గట్టి పోటీ ఇస్తుందని కంపెనీ భావిస్తోంది.

## టాటా ఎలక్ట్రిక్ కార్లపై బంపర్ ఆఫర్

### రూ.1.86 లక్షల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్న సంస్థ



**ముంబై,**

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ మరో రికార్డు సృష్టించింది. దేశవ్యాప్తంగా 2 లక్షల ఈవీ కార్లను విక్రయించిన సందర్భంగా కొనుగోలుదారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. వచ్చే 45 రోజులపాటు కొనుగోలు చేసే ఈవీ మాడళ్లపై రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నది. నూతన ఈవీని కొనుగోలు చేసేవారికి ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.50 వేలు, జీరో డౌన్‌పేమెంట్‌తో 100 శాతం ఫైనాన్స్, ఆరు నెలలపాటు నెక్సాన్.ఈవీ, కర్వీ.ఈవీలను ఆరు నెలలపాటు ఉచితంగా చార్జింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. 7.2 కిలోవాట్ల ఏసీ ఫాస్ట్ చార్జర్‌ను ఇంట్లోనే ఇన్‌స్టాల్ చేసుకోనే వీలుంటుంది. 2027 నాటికి దేశవ్యాప్తంగా 4 లక్షల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడానికి సంస్థ సిద్ధమైంది.

## భారత్‌లో ఐఫోన్ 16ఈ



ఐఫోన్ సిరీస్ ఫోన్లు భారత్‌లోనే తయారవుతున్నాయి. ఇప్పటికే పలు ఫోన్లు ఉత్పత్తి అవుతుండగా.. తాజాగా 16ఈ ఫోన్ కూడా అసెంబ్లింగ్ అవుతున్నది. చెన్నై ప్లాంట్లో తయారవుతున్న ఈ ఫోన్ భారత్‌తోపాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నది. భారత్‌లో ఈ ఫోన్ ఈ నెల 28 నుంచి అందుబాటులోకి రాబోతున్నది. ఈ ఫోన్ కావాలనుకునేవారు ఈ శుక్రవారం నుంచి ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.

## ఐపీవోకి ఫోన్‌పే!

ఫోన్‌పే కూడా స్టాక్ మార్కెట్లో లిస్ట్‌కావడానికి సిద్ధమవుతున్నది. ప్రస్తుతం కంపెనీ విలువ 12 బిలియన్ డాలర్లు. దేశీయ మార్కెట్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్న ఈ విదేశీ సంస్థ వెనుకుండి సేవలు అందిస్తున్న ఫోన్‌పే.. దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టి పదేండ్లు పూర్తైన సందర్భంగా ఎక్స్ఛేంజ్‌ల్లో అడుగుపెట్టడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఐపీవో సన్నాహాల్లో భాగంగా ఫోన్‌పే 2022 డిసెంబర్‌లోనే తన హోల్డింగ్ కంపెనీని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించింది. ఇందుకోసం రూ.8 వేల కోట్లు పన్ను రూపంలో చెల్లించింది. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో 48 శాతం వాటాతో ఫోన్‌పే అగ్రస్థానంలో ఉన్నది. గూగుల్‌పే 37 శాతం వాటాతో రెండో స్థానంలో కొనసాగుతన్నది.

## తొలి మ్యాచ్‌లో భారత్ విజయం..



ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీం ఇండియా తన ప్రయాణాన్ని విజయంతో ప్రారంభించింది. దుబాయ్‌లో జరిగిన మ్యాచ్‌లో, టీం ఇండియా తొలి మ్యాచ్‌లోనే బంగ్లాదేశ్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి ఖాతా తెరిచింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలోని క్లిష్టమైన పిచ్‌పై 229 పరుగుల లక్ష్యాన్ని చేరుకోవడంలో టీమ్ ఇండియా చాలా కష్టపడింది. ఒకానొక సమయంలో భారత్ ఓడిపోయేలా అనిపించింది. కానీ, శుభ్‌మాన్ గిల్ అద్భుతమైన సెంచరీతో మ్యాచ్‌ను విజయంవైపు నడిపించాడు. టీమ్ ఇండియాకు విజయం అందించేంత వరకు క్రీజులోనే ఉండిపోయాడు. గిల్ కంటే ముందు స్టార్ పేసర్ మహ్మద్ షమీ 5 వికెట్లు తీసి బంగ్లాదేశ్ ఆశలను దెబ్బతీసి టీం ఇండియా విజయానికి పునాది వేశాడుటాస్ గెలిచిన తర్వాత ముందుగా బ్యాటింగ్ చేయాలనే నిర్ణయం కూడా బంగ్లాదేశ్‌కు మంచిది కాదు. జట్టు కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో తీసుకున్న ఈ నిర్ణయం వెనుక కారణం ఏమిటంటే, సాయంత్రం దుబాయ్ స్టేడియంలో మంచు ఉండదు. దాని కారణంగా బంగ్లా స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారని భావించాడు. అందుకోసం భారీ స్కోరు సాధించాల్సి అనుకున్నాడు. కానీ మొదటి, రెండవ ఓవర్లలో వరుసగా రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత, ఈ నిర్ణయం తప్పు అని నిరూపితమైంది. 9వ ఓవర్ నాటికి, జట్టు కేవలం 35 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. అందులో షమీ 2 వికెట్లు పడగొట్టాడు. 9వ ఓవర్లో అక్షర్ పటేల్ వరుసగా రెండు వికెట్లు పడగొట్టాడు. కానీ, రోహిత్ శర్మ జాకీర్ అలీ క్యాచ్‌ను జారవిడిచి అక్షర్ హ్యాట్రిక్ తీయకుండా అడ్డుకున్నాడు. ఈ క్యాచ్ వదిలేయడం వల్ల టీం ఇండియా తీవ్ర పరిణామాలు అనుభవించాల్సి వచ్చింది. జకీర్ అలీ, తౌహీద్ హృదయ్ ఆరో వికెట్‌కు 154 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును తిరిగి జట్టులోకి తీసుకువచ్చారు. ఈ సమయంలో, హార్దిక్ పాండ్యా కూడా క్యాచ్‌ను వదిలివేసి తౌహీద్‌కు ఉపశమనం కలిగించాడు. ఆ సమయంలో అతను కేవలం 23 పరుగులు మాత్రమే చేశాడు. కానీ ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు దీనిని సద్వినియోగం చేసుకున్నారు. ఈ అద్భుతమైన భాగస్వామ్యంతో జట్టును పోటీపడే స్థితికి తీసుకువచ్చారు. జకీర్‌ను అవుట్ చేయడం ద్వారా, షమీ వన్డేల్లో తన 200 వికెట్లను పూర్తి చేసుకున్నాడు. ఇంతలో, తౌహీద్ వన్డే క్రికెట్‌లో తన తొలి సెంచరీని పూర్తి చేయడం ద్వారా చిరస్మరణీయంగా మార్చుకున్నాడు. అయితే, షమీ చివరి బ్యాట్స్‌మెన్‌ను ఎక్కువసేపు ఉండనివ్వలేదు. 5 వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌ను 228 పరుగుల వద్ద ముగించాడు

## అప్పటికీ ఇప్పటికీ ఆట గురించి తపిస్తూనే ఉన్నాను

### ధోనీ ఆసక్తికర వ్యాఖ్యలు



అంతర్జాతీయ, భారత క్రికెట్?లో విజయవంతమైన కెప్టెన్లు చాలా మంది ఉన్నారు. కానీ అందరికంటే సక్సెస్?ఫుల్ కెప్టెన్ అంటే అందరికీ ముందుగా గుర్తొచ్చేది ఎంఎస్ ధోనీ. ఆఖరి ఓవర్లలో ఫినిషింగ్ నాక్?లు ఆడటమే కాదు, కెప్టెన్?గా జట్టుకు విజయాలను అందించడంలోనూ ఈయన దిట్టే. తన కెప్టెన్సీలోనే టీమ్?ఇండియా మూడు ఐసీసీ టైటిళ్లను గెలుచుకుంది. 2007లో టీ20 ప్రపంచకప్, 2011లో వన్డే ప్రపంచకప్, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీని మిస్టర్ కూల్ సారధ్యంలోనే భారత్ ముద్దాడింది.ఆరేళ్ల క్రితం ధోనీ అంతర్జాతీయ క్రికెట్?కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం ఐపీఎల్?లో చెన్నై తరఫున ఆడుతున్నాడు. తాజాగా ఒక యాప్ లాంఛ్ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ తన కెరీర్, భవిష్యత్తు గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆట నుంచి దూరమై ఆరేళ్లు గడిచినప్పటికీ, తాను ఇంకా ఆటను ఆస్వాదిస్తున్నానని తెలిపాడు. స్కూల్ రోజుల్లో ఎలాగైతే ఆటను ఎంజాయ్ చేశానో, ప్రస్తుతం కూడా అలాగే గేమ్?ను ఆస్వాదిస్తున్నట్లు పేర్కొన్నాడు. "నా చిన్నప్పుడు మధ్యాహ్నం 4గంటలకు స్పోర్ట్స్ బ్రేక్ ఉండేది. అప్పుడు మేము క్రికెట్ ఆడటానికి వెళ్లేవాళ్లం. కానీ వాతావరణం అనుకూలించకపోతే ఫుట్ బాల్ ఆడేవాళ్లం. చిన్నప్పుడు ఆట కోసం ఎంత తపించేవాడినో, ఇప్పుడు కూడా అంతే ఇంటెన్సిటీ ఉంది. " అని ఎంఎస్ ధోనీ వ్యాఖ్యానించాడు. దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు యంగ్ ప్లేయర్స్ ఫోకస్ సరిగ్గా ఉండాలని టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అభిప్రాయపడ్డారు. తమ ప్రాధాన్యత ఏదో గుర్తించాలని యంగ్ ప్లేయర్స్ కు సూచించాడు. "నేను క్రికెట్ పై పూర్తిగా ఫోకస్ పెట్టాను. నాకు మరేదీ ముఖ్యం కాదు. ఒక ఆటగాడిగా నాకు భారత జట్టు తరఫున మంచి ప్రదర్శన ఇవ్వాలనే ఉండేది. ఎందుకంటే దేశం తరఫున ఆడే అవకాశం అందరికీ రాదు. దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు, ఎంతో ఒత్తిడి ఉంటుంది. ప్రతి మ్యాచ్ లోనూ నానుంచి బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నించాను." అని ధోనీ తెలిపాడు.


# స్పోర్ట్స్

## భారత్?తో మ్యాచ్ కు ఫకర్ జమాన్ దూరం!?

### -23న జరగనున్న భారత్?, పాకిస్థాన్ మ్యాచ్?



ఛాంపియన్స్? ట్రోఫీని ఓటమితో ప్రారంభించిన ఆతిథ్య పాకిస్థాన్?కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాటర్ గాయంతో రెండో మ్యాచ్?కు దూరమయ్యాడు. న్యూజిలాండ్?తో మ్యాచ్?లో ఫీల్డింగ్ చేస్తుండగా ఫకర్ జమాన్ గాయపడ్డాడు. దీంతో అతడు ఫిబ్రవరి 23న భారత్?తో జరగనున్న మ్యాచ్?కు దూరమయ్యాడు. అతడి స్థానంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఇమామ్ ఉల్ హక్ పేరును ప్రకటించింది. అయితే ఫకర్ జమాన్ తదుపరి ఒక్క మ్యాచ్?కేనా లేదా టోర్నీ మొత్తానికి దూరం కానున్నాడా అన్న దానిపై క్లారిటీ లేదు. అతడి తదుపరి మెడికల్ రిపోర్టులు వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే ఛాన్స్ ఉంది. బుధవారం మ్యాచ్?లో కివీస్ బ్యాటర్ బాదిన బౌండరీని ఆపెందుకు 30యార్ట్ సర్కిల్?లో ఫీల్డింగ్? చేస్తున్న ఫకర్ జమాన్ తీవ్రంగా ప్రయత్నించాడు. బంతి బౌండరీ లైన్ దాటకుండా ఆపగలిగాడు. ఈ క్రమంలోనే గాయపడ్డాడు. దీంతో ఫీల్డ్?లోకి వచ్చిన మెడికల్ టీమ్ జమాన్?కు చికిత్స అందించింది. నొప్పి ఎక్కువగా ఉండడం వల్ల జమాన్ మైదానం వీడాడు. ఇక ఛేజింగ్?లో ఓపెనింగ్?కు దిగాల్సిన జమాన్, నాలుగో స్థానంలో బ్యాటింగ్?కు వచ్చాడు. క్రీజులో ఉన్నంతసేపు అసౌకర్యంగానే కనిపించాడు. 41 బంతులు ఆడిన జమాన్ కేవలం 24 పరుగులే చేయగలిగాడు.ఇక మ్యాచ్ విషయానికొస్తే, స్వదేశంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక టోర్నీని పాక్ ఓటమితో ప్రారంభించింది. బుధవారం కివీస్?తో జరిగిన మ్యాచ్?లో 60 పరుగుల తేడాతో ఓడింది. 321 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాక్ 47.2 ఓవర్లలో 260 స్కోర్?కు ఆలౌట్ అయ్యింది. కుష్?దీల్ షా (69 పరుగులు, 49 బంతుల్లో), బాబార్ అజామ్ (64 పరుగులు, 90 బంతుల్లో) హాఫ్ సెంచరీలు సాధించగా, సల్మాన్ అఘ (42 పరుగులు) ఆకట్టుకున్నాడు. కివీస్ బౌలర్లలో శాంట్నర్, ఓ రూర్కీ చెరో 3, హెన్రీ 2, బ్రెస్?వెల్, స్మిత్ తలో 1 దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కివీస్ 320-5 పరుగుల చేసింది.




# ఆసక్తిరేపుతున్న ఓదెల-2


టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం ఓదెల 2. సంపత్ నంది ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తోన్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నాడు. ఓం నమ: శివాయ.. అంటూ తమన్నా శివశక్తి లుక్ ఇప్పటికే నెట్టింట పోస్టర్లు వైరల్ అవుతున్నాయని తెలిసిందే. ఈ చిత్రంలో తమన్నా మహదేవ్‌కు పరమభక్తురాలిగా, ఓదెల సద్గుణ రక్షకురాలిగా కనిపించనుంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్‌ను షేర్ చేశారు మేకర్స్. ఈ సినిమా ఖాతాలో అరుదైన ఫీట్ చేరనుంది. ఓదెల 2 టీజర్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ మేళాలో ఫిబ్రవరి 22న లాంచ్ చేయనున్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో టీజర్ లాంచ్ చేసుకోబోతున్న తొలి ఇండియన్ సినిమాగా చరిత్రలో నిలిచిపోనుంది. ఈ లాంచ్ ఈవెంట్‌కు చిత్రయూనిట్, మేకర్స్ హాజరుకానున్నారు. మొత్తానికి దేశమంతా మహాకుంభ్ మేళావైపు చూస్తున్న నేపథ్యంలో అక్కడే టీజర్ లాంచ్ సినిమాపై అందరి అటెన్షన్‌ను తమవైపునకు తిప్పుకుంటోంది. ఈ చిత్రంలో వశిష్ఠ ఎన్ సింహా, హరిప్రియ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంపత్ నంది టీమ్ వర్క్ బ్యానర్, మధు క్రియేషన్స్‌పై తెరకెక్కిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఓదెల 2 కోసం తమన్నా శివశక్తి రూపంలోకి ఎలా మారిందని తెలియజేస్తూ మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్.

# విలాసం కంటే సౌకర్యమే ముఖ్యం

గత ఏడాది బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో కలిసి వివాహబంధంలోకి అడుగుపెట్టింది కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్. అయితే ఆ పెళ్లిలో అతిథులు ఫోన్‌లు వెంట తీసుకురావొద్దనే ఆంక్షలు విధించారు. ఈ విషయమై తాజా ఇంటర్వ్యూలో స్పందించింది రకుల్‌ప్రీత్‌సింగ్. పెళ్లి వేడుకను అందరూ ఆనందంగా ఆస్వాదించాలనే ఆలోచనతో ఆ నిర్ణయం తీసుకున్నామని చెప్పింది. ఆమె మాట్లాడుతూ 'పెళ్లి ఫొటోలు అతిథుల ద్వారా బయటకు వస్తాయనే భయంతో ఫోన్‌లు నిరాకరించామని మీడియాలో వార్తలొచ్చాయి. వాటిలో వాస్తవం లేదు.వివాహ వేడుక చాలా సింపుల్‌గా జరుపాలనుకున్నాం. కొద్ది మంది సన్నిహితులను మాత్రమే ఆహ్వానించాం. నా దృష్టిలో విలాసం కంటే సౌకర్యం చాలా ప్రధానం. పెళ్లి తాలూకు మధుర క్షణాలను అతిథులు కూడా పరిపూర్ణంగా ఆస్వాదించాలని నో ఫోన్ పాలసీ పెట్టాం. పెళ్లి తర్వాత మేమే ఫొటోలను మీడియాకు విడుదల చేశాం' అని చెప్పుకొచ్చింది. రకుల్‌ప్రీత్‌సింగ్ తాజా చిత్రం 'మేరే హస్బెండ్ కీ బీవీ' ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది.



# ఛావాను రిజెక్టు చేసిన మహేష్‌బాబు








బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం ఛావా. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించగా.. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించాడు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌తో దూసుకెళుతుంది. ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.200 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమా కథ మొదట సూపర్ స్టార్ మహేశ్ బాబు దగ్గరికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ మూవీ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ శంభాజీ పాత్ర కోసం మొదట మహేశ్ బాబు సంప్రదించినట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్ నచ్చని మహేశ్ రిజెక్ట్ చేశాడు. దీంతో చాలా రోజుల తర్వాత మళ్లీ ఇదే కథతో విక్కీ కౌశల్ దగ్గరికి వెళ్లగా విక్కీ ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. అయితే మహేశ్‌కి ఇలా సూపర్ హిట్ అయిన సినిమాలు రిజెక్ట్ చేయడం కొత్తేమి కాదు. ఇంతకుముందు కూడా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన గజిని సినిమాను, అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాను రానా నటించిన లీడర్, రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన యానిమల్, ప్రభాస్ వర్షం, రవితేజ ఇడియట్, విజయ్ దళపతి నన్బన్, నాగ చైతన్య ఏ మాయ చేసావే, పూరీ జనగణమన (ప్రాజెక్ట్ స్టార్ట్ కాలేదు) తదితర సినిమాలను మహేశ్ రిజెక్ట్ చేశాడు.





# కెరీర్ విషయంలో సంతృప్తిగా ఉన్నా!

నేను ఇప్పటివరకు ఫుల్‌లెంగ్త్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ సినిమా చేయలేదు. ఈ సినిమాతో ఆ లోటు తీరింది. నా పాత్రకు కథాగమనంలో చాలా ప్రాధాన్యత ఉంటుంది' అని చెప్పింది రీతూ వర్మ. ఆమె కథానాయికగా సందీప్‌కిషన్ సరసన నటించిన చిత్రం 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం కథానాయిక రీతూవర్మ పాత్రికేయులతో ముచ్చటించింది. 'మజాకా' సినిమాలో కావాల్సినంత వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయని తెలిపింది. ఆమె మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను కాలేజీ అమ్మాయి పాత్రలో కనిపిస్తా.చిన్నతనంలో ఎదుర్కొన్న మానసిక సంఘర్షణ ఆమె వ్యక్తిత్వంపై ఎలాంటి ప్రభావాన్ని చూపింది? హీరోతో తన బంధం ఎలా సాగింది? అనే అంశాలు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తాయి' అని చెప్పింది. ఇప్పటివరకు ఈ తరహా క్యారెక్టర్ చేయలేదని రీతూవర్మ ఆనందం వ్యక్తం చేసింది. కెరీర్ విషయంలో బాధపడి సందర్భాలు ఎప్పుడూ లేవని, మనసుకు నచ్చిన పాత్రలు పోషించాననే సంతృప్తి ఉందని, కొన్ని ఫెయిల్యూర్స్ మినహా నాయికగా తనది విజయవంతమైన ప్రయాణమని రీతూవర్మ చెప్పింది.

# రామ్‌చరణ్‌తో నటించనున్న రష్మిక

అగ్ర కథానాయిక రష్మిక మందన్న పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోతున్నది. 'పుష్ప-2'తో గత ఏడాది పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్న ఈ సొగసరి తాజాగా 'ఛావా' సినిమాతో మరో సూపర్‌హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. 'ఛావా' సినిమాలో ఈ భామ అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న రష్మిక మందన్న తాజాగా తెలుగులో మరో భారీ ప్రాజెక్ట్‌కు అంగీకరించిందని వార్తలొస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం రామ్‌చరణ్ ఓ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్న విషయం తెలిసిందే. బుచ్చిబాబు సానా దర్శకుడు. ఈ సినిమా తర్వాత సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు రామ్‌చరణ్. 'రంగస్థలం' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాల్ని పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌పై దృష్టి పెట్టారు దర్శకుడు సుకుమార్. గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరువయ్యేలా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా రష్మిక మందన్న ఎంపిక చేసే ఆలోచనలో చిత్రబృందం ఉందని తెలిసింది. చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకూ కలిసి నటించలేదు. దీంతో వీరిద్దరి జోడీ కొత్తగా ఉంటుందనే ఆలోచనలో దర్శకుడు సుకుమార్ ఉన్నారని అంటున్నారు. అయితే ఈ సినిమా పట్టాలెక్కడానికి ఇంకా చాలా సమయం ఉండటంతో కథానాయిక విషయంలో లెక్కలు మారే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఎక్కువ శాతం రష్మికకే అవకాశాలున్నాయని ఫిల్మ్ సర్కిల్స్‌లో టాక్ నడుస్తున్నది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492